JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి । శుక్రవారం 21-08-2026
Medchal - Malkajgiri । Friday 21-08-2026
Follow: jayabherinews
సంపుటి : 03 । సంచిక : 81
పేజీలు : 8 । వెల : 5
Vol. 03 । Issue 81 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com


# జపాన్‌తో భారత్ కీలక రక్షణ ఒప్పందం

- చైనా, పాక్‌కు పెరిగిన టెన్షన్
- ఢిల్లీలో సమావేశమైన రాజ్‌నాథ్ సింగ్, షింజిరో కొయిజుమి
- ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం కోసం ప్రధాన ఒప్పందం
- సముద్ర భద్రత, నౌకాదళ భద్రత, రక్షణపై దృష్టి



**జయభేరి, న్యూఢిల్లీ:**

ఇండోపసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వాన్ని పెంపొందించేందుకు రక్షణ సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని భారత్, జపాన్ దేశాలు నిర్ణయించాయి. ఢిల్లీలోఆగస్టు 20 భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జపాన్ రక్షణ మంత్రి షింజిరో కొయిజుమి ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సముద్ర భద్రతా సహకారంపై ఓ ఫ్రేమ్‌వర్క్ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. సముద్ర భద్రతా రంగంలో ఇరు దేశాల మధ్య మరింత సహకారానికి ఇరుదేశాల రక్షణ మంత్రిత్వ శాఖలు ఒప్పంద పత్రంపై సంతకాలు చేశాయి. సముద్ర భద్రతా రంగంలో ఇరు దేశాల సైన్యాల మధ్య ఆచరణాత్మక సహకారాన్ని పెంపొందించేందుకు కూడా ఓ ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం.. సముద్ర డొమైన్ సమాచారాన్ని పంచుకోవడంతో సహా, జపాన్ సముద్ర స్వీయరక్షణ దళం, భారత నౌకాదళం

...మిగతాది 2 లో




- అమిత్ షా అధ్యక్షతన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం
- దక్షిణాది సీఎంల కీలక ప్రతిపాదనలు
- కృష్ణా జలాల్లో న్యాయమైన వాటా, విభజన సమస్యల త్వరితగతిన పరిష్కారమే లక్ష్యం
- సదరన్ జోనల్ కౌన్సిల్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

## దక్షిణాది రాష్ట్రాల సమస్యలకు
# చర్చలతోనే చెక్

*మహాబలిపురంలో జరిగిన 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కీలక ప్రసంగం చేశారు. కృష్ణా జలాల్లో న్యాయమైన వాటా, విభజన సమస్యల త్వరితగతిన పరిష్కారమే లక్ష్యంగా కేంద్రానికి, పొరుగు రాష్ట్రాలకు ఆయన స్పష్టమైన సందేశం ఇచ్చారు.*

**జయభేరి, చెన్నై, ఆగస్టు 20 :**

కేంద్రం, రాష్ట్రాల మధ్య.. అలాగే పొరుగు రాష్ట్రాలతో తలెత్తే సమస్యల పరిష్కారంలో సదరన్ జోనల్ కౌన్సిల్ అత్యంత కీలక వేదికగా నిలుస్తుందని తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఉద్ఘాటించారు. తమిళనాడులోని మహాబలిపురంలో ప్రతిష్టాత్మకంగా జరిగిన 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన రాష్ట్ర వాణిని బలంగా వినిపించారు. సహకార సమాఖ్య విధానంలో సమస్యలను కేవలం సుదీర్ఘమైన చర్చలకే పరిమితం చేయకుండా తక్షణమే నిర్ణయాలు తీసుకుని, వాటిని వేగంగా అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన స్పష్టం చేశారు. అక్కడి చారిత్రక కట్టడాలను ప్రస్తావిస్తూ.. ఒక బలమైన నిర్మాణానికి ప్రతి భాగం ఒకేలా ఉండాల్సిన పనిలేదని, ప్రతి రాయి తన వంతు భారాన్ని మోస్తేనే ఆ కట్టడం బలంగా ఉంటుందని విశ్లేషించారు. మన భారతీయ సమాఖ్య వ్యవస్థను కూడా సరిగ్గా ఇదే స్ఫూర్తితో చూడాలని ఆయన సూచించారు. అన్ని విషయాల్లో ఏకాభిప్రాయం ఉన్నప్పుడే కాకుండా, రాష్ట్రాల ప్రయోజనాలు భిన్నంగా ఉన్నప్పుడు న్యాయబద్ధమైన పరిష్కారాన్ని కనుగొనడమే సమాఖ్య వ్యవస్థకు అసలు పరీక్ష అని భట్టి విక్రమార్క కుండబద్దలు కొట్టారు. ప్రస్తుత రోజుల్లో పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాలు, ప్రతిభ కోసం రాష్ట్రాల మధ్య తీవ్రమైన పోటీ సహజమేనని భట్టి విక్రమార్క అంగీకరించారు. అయితే నదులు, విద్యుత్ గ్రిడ్లు, కార్మికులు, వ్యాపార లావాదేవీలు రాష్ట్ర సరిహద్దులను సులభంగా దాటి ప్రయాణిస్తాయని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వ ఫైళ్ల కంటే సమస్యలు సరిహద్దులను చాలా వేగంగా దాటుతాయని ఆయన చమత్కరించారు. తెలంగాణ దృష్టిలో సహకార సమాఖ్య విధానం అంటే నిబంధనలు స్పష్టంగా ఉండటం, వివాద పరిష్కారానికి ఏర్పాటు చేసిన సంస్థలను అందరూ గౌరవించడం,

...మిగతాది 2 లో



## నా కూతురి వ్యాఖ్యలకు నేను బాధ్యురాలిని కాను

- పీసీసీకి మంత్రి కొండా సురేఖ వివరణ

**జయభేరి, హైదరాబాద్ :**

టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ ఇచ్చిన నోటీసుపై మంత్రి కొండా సురేఖ స్పందించారు. తన కూతురు సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు వ్యక్తిగతమని, వాటితో తనకు సంబంధం లేదని స్పష్టం చేస్తూ క్రమశిక్షణా కమిటీ చైర్మన్ మల్లు రవికి వివరణ ఇచ్చారు. తన కూతురు చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ జారీ చేసిన నోటీసుపై మంత్రి కొండా సురేఖ తాజాగా స్పందించారు. ఈ మేరకు క్రమశిక్షణా కమిటీ చైర్మన్ మల్లు రవికి ఆమె గురువారం ఒక సుదీర్ఘ వివరణతో కూడిన లేఖను పంపించారు. తన కూతురు కొండా సుస్మితా పటేల్ ఇటీవల గీసుకొండలో చేసిన రాజకీయ వ్యాఖ్యలతో తనకు ఎలాంటి సంబంధం లేదని ఆమె అందులో స్పష్టం చేశారు. కుటుంబ బాంధవ్యం ఉన్నంత మాత్రాన ఒకరి వ్యక్తిగత అభిప్రాయాలకు మరొకరు రాజకీయంగా బాధ్యత వహించాలనడం, ఆ ప్రాతిపదికన తనకు వివరణ కోరుతూ నోటీసు ఇవ్వడం సముచితం కాదని మంత్రి తన లేఖలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలు, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఈ వ్యవహారంలో తన ప్రమేయం లేదని గుర్తించాలని కమిటీని కోరారు. ఆగస్టు 19న తన జన్మదినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు పలుచోట్ల వేడుకలు నిర్వహించారని మంత్రి సురేఖ తెలిపారు. ఇందులో భాగంగా తన స్వస్థలమైన గీసుకొండలో కూడా అభిమానులు నిర్వహించిన వేడుకల్లో తన కుమార్తె సుస్మితా పటేల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారని చెప్పారు. ఆ సభలో తన కుమార్తె చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగత అభిప్రాయం మాత్రమేనని, వాటికి తనను బాధ్యురాలిగా చేయడం సహజ న్యాయ స్ఫూర్తికి విరుద్ధమని వివరించారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వం, పార్టీ క్రమశిక్షణా నియమావళి పట్ల తనకు సంపూర్ణ గౌరవం ఉందని, తనకు జారీ చేసిన నోటీసును వెంటనే

...మిగతాది 2 లో



# ఏసీబీ వలలో భారీ అవినీతి తిమింగలం

- హైదరాబాద్ చుట్టూ భారీగా ఆస్తులు
- ఏకంగా రూ.100 కోట్లకుపైగా ఆస్తులు
- 10 ఎకరాలకు పైగా వ్యవసాయ భూమి
- కేజీన్నర బంగారం గుర్తింపు
- పత్రాలు, బ్యాంకు లావాదేవీలపై ఫోకస్

**జయభేరి, రంగారెడ్డి జిల్లా :**

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ఏసీబీ సోదాలతో ఒక్కసారిగా కలకలం రేగింది. ప్రస్తుతం ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న శ్రీనివాస్‌రెడ్డికి సంబంధించిన ఇళ్లు, కార్యాలయాలు సహా సుమారు 15 ప్రాంతాల్లో ఏకకాలంలో ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న శ్రీనివాస్‌రెడ్డిపై ఏసీబీ చేపట్టిన సోదాలు సంచలనంగా మారాయి. గతంలో మహేశ్వరం, బాలాపూర్, శంషాబాద్ తహసీల్దార్‌గా పనిచేసిన ఆయనకు సంబంధించి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో భారీగా ఆస్తులు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించినట్లు సమాచారం. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై

...మిగతాది 2 లో

# ఆ మంత్రిని తప్పించండి

- ఇదిగో ఆధారాలు - రాహుల్ గాంధీకి హరీష్ లేఖ
- వేలాది ప్రైవేటు ఆస్తులను 22A జాబితాలో పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన
- బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదు



**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 22ఏ భూముల వ్యవహారం సంచలనంగా మారింది. బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వం పై ఈ వ్యవహారాన్ని రాజకీయ అస్త్రంగా మార్చుకున్నారు. ఈ వ్యవహారం పైన సీఎం రేవంత్ కీలక హామీ ఇచ్చారు. మంత్రి పొంగులేటి క్షమాపణ చెప్పారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ ముఖ్య నేత హరీష్‌రావు నేరు గా కాంగ్రెస్ ముఖ్య నేత రాహుల్ గాంధీకి లేఖ రాసారు. కీలక అంశాలను ప్రస్తావించారు.

...మిగతాది 2 లో



# వికసిత్ భారత్ నిర్మాణంలో దక్షిణాది కీలక ఆర్థిక శక్తిగా ఎదగాలి

- వనరుల లోటు, సెక్షన్ 56లోని అంశాలను పరిష్కరించాలి
- సీఎం చంద్రబాబు నాయుడు

**జయభేరి, మహాబలిపురం :**

హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం చెన్నైలో జరిగింది. ఈ భేటీకి ఏపీ సీఎం చంద్రబాబు, తమిళనాడు సీఎం విజయ్, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి సీఎంలు హాజరయ్యారు. సమావేశంలో ఏపీ సహా దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి గురించి సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. దక్షిణాది రాష్ట్రాల మధ్య సహకారమే లక్ష్యమని వెల్లడించారు. కేంద్రం-రాష్ట్రాల మధ్య విశ్వాసం, పరస్పర సహకారంతో సమస్యల పరిష్కారం జరగాలని సీఎం సూచించారు. ఏపీ, కర్ణాటక, తమిళనాడును అనుసంధానించే బుల్లెట్ ట్రైన్ కారిడార్కు ప్రతిపాదన తెచ్చారు. కుప్పం మీదుగా బుల్లెట్ ట్రైన్ నడపాలని ప్రతిపాదించారు. అమరావతి-బెంగళూరు-చెన్నై నగరాలను అనుసంధానించే రవాణా వ్యవస్థ ఉండాలని స్పష్టం చేసారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఉమ్మడి

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## నేను బాధ్యురాలిని కాను

ఉపసంహరించుకోవాలని క్రమశిక్షణా కమిటీకి ఆమె గౌరవపూర్వకంగా విజ్ఞప్తి చేశారు. అసలేం జరిగిందంటే.. పరకాల నియోజకవర్గ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. గీసుకొండలో జరిగిన జన్మదిన వేడుకల కార్యక్రమంలో కొండా సుస్మితా పటేల్ ఏకంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరకాల స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిలను లక్ష్యంగా చేసుకుని సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడు అయ్యేందుకు కొండా మురళీ ఎంతో సహకరించారని, అప్పట్లో ఎమ్మెల్సీ ఇస్తానని చెప్పి సీఎం మాట తప్పారని ఆమె ఆరోపించారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డికి పరకాల టికెట్ ఎలా ప్రకటిస్తారంటూ ఆమె తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తాము అండగా నిలబడితేనే కాంగ్రెస్ పార్టీ అక్కడ బలంగా ఉందని, దమ్ముంటే రేవూరి ప్రకాష్ రెడ్డితో రాజీనామా చేయించి ఇప్పుడే ఎన్నికలకు రావాలని ఆమె బహిరంగంగా సవాల్ విసిరారు. సొంత పార్టీ ముఖ్యమంత్రిని, ఎమ్మెల్యేని టార్గెట్ చేస్తూ మంత్రి కూతురు ఇలాంటి బహిరంగ విమర్శలు చేయడం కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. ఈ పరిణామాలను సీరియస్‌గా తీసుకున్న పీసీసీ అధిష్ఠానం.. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించారనే కారణంతో మంత్రి కొండా సురేఖకు వివరణ కోరుతూ నోటీసులు జారీ చేసింది.

## వికసిత్ భారత్ నిర్మాణంలో..

లాజిస్టిక్స్ నెట్వర్క్, డ్రై పోర్టులు ఏర్పాటు చేయాలని సూచించారు. దక్షిణాది విద్యుత్ గ్రిడ్ను జాతీయ గ్రిడ్తో అనుసంధానించాలి. దక్షిణాది రాష్ట్రాల యూనివర్సిటీలు, స్కిల్లింగ్ సంస్థలతో ఉమ్మడి కన్సార్టియం ఏర్పాటు చేయాలని స్పష్టం చేసారు. విపత్తుల సమయంలో రాష్ట్రాలు పరస్పరం సహకరించుకునే మ్యూచువల్ ఎయిడ్ ఫోర్స్ ఏర్పాటు, తిరుపతి నుంచి కాశీ, అయోధ్య, చార్ధామ్ వరకు ఉమ్మడి ఆధ్యాత్మిక పర్యాటక సర్క్యూట్ ఏర్పాటు చేయాలని కోరారు. దేశ జీడీపీలో దక్షిణాది రాష్ట్రాల వాటా సుమారు 31 శాతం ఉందన్న సీఎం, 2047 నాటికి దక్షిణాది ఆర్థిక వ్యవస్థ 10 ట్రిలియన్ డాలర్లకు చేరే అవకాశం ఉందని వెల్లడించారు. వికసిత్ భారత్ నిర్మాణంలో దక్షిణాది కీలక ఆర్థిక శక్తిగా ఎదగాలనీ ప్రసంగంలో పేర్కొన్నారు. విభజన చట్టంలోని షెడ్యూల్ 9, 10 సంస్థలు 12 ఏళ్లుగా ఇంకా విభజనకు నోచుకోలేదనీ వెల్లడించారు. విభజన సమస్యల పరిష్కారానికి కేంద్రం వేగంగా చర్యలు తీసుకోవాలనీ కేంద్రాన్ని కోరారు. పోలవరం, సౌత్ కోస్ట్ రైల్వే జోన్, అమరావతి ప్రాజెక్టులు కేంద్ర సహకారంతో సాకారం అవుతున్నట్టు స్పష్టం చేసారు. అమరావతికి చట్టబద్ధ రాజధాని హోదా సాధించాం. వనరుల లోటు, సెక్షన్ 56లోని అంశాలను పరిష్కరించాలనీ కోరారు.

## ఆ మంత్రిని తప్పించండి

22ఏ భూముల వ్యవహారం కొత్త మలుపు తీసుకుంది. తెలంగాణలో 22A నిషేధిత జాబితా భూముల సెక్షన్ దుర్వినియోగంపై రాహుల్ గాంధీకి హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ సహా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో HMDA అనుమతులున్న వేలాది ప్రైవేటు ఆస్తులను 22A జాబితాలో పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ శాఖలో అడ్డగోలు అవినీతి జరుగుతోందని, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటోన్న రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మంత్రివర్గం నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. సెక్షన్ 22A అనేది నిషేధిత భూముల రిజిస్ట్రేషన్ ఆపడానికి తెచ్చిన చట్టమని.. ప్రైవేటు ఆస్తులపై కృత్రిమ వివాదాలు సృష్టించి వసూళ్లకు పాల్పడటానికి కాదని వెల్లడించారు. ప్రైవేటు ఆస్తులను ఏకపక్షంగా 22A జాబితాలో పెడుతూ వేధింపులకు గురిచేస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. తప్పించే వరకు పోరాటం ఆగదు రెవెన్యూ శాఖలో నిషేధిత జాబితా నుంచి ఆస్తులు తొలగించుకోవడానికి దళారులు 30% కమీషన్లు డిమాండ్ చేస్తున్నారని తీవ్ర ఆరోపణలు వస్తున్నాయని హరీష్ వివరించారు. 22Aపై తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలన్నారు. దీనిపై వెంటనే స్వతంత్ర విచారణకు రేవంత్ ప్రభుత్వం ఆదేశించాలి. బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదు అని లేఖలో పేర్కొన్నారు. 2023 డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు నిషేధిత జాబితాలో చేర్చిన, తొలగించిన ప్రతి భూమిపైనా రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తితో స్వతంత్ర విచారణ జరిపించాలని కోరారు. జిల్లాల వారీగా 22A జాబితాను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలి.. ఏ భూమిని ఎప్పుడు చేర్చారు, ఎవరి ఆదేశంతో తీసేశారో ప్రజలకు పారదర్శకంగా తెలియాలని హరీష్ కోరారు.

## ఏసీబీ వలలో భారీ.. తిమింగలం

ప్రారంభమైన దర్యాప్తులో ఒక్కొక్కటిగా బయటపడుతున్న ఆస్తుల వివరాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.

**రూ.100 కోట్లకు పైగా ఆస్తులా?**

ఏసీబీ సోదాల్లో శ్రీనివాస్‌రెడ్డికి సంబంధించిన ఆస్తుల విలువ రూ.100 కోట్లకు పైగా ఉండొచ్చని అధికారులు గుర్తించినట్లు సమాచారం. అయితే ఈ ఆస్తుల పూర్తి విలువ, వాటి చట్టబద్ధత, ఆదాయ వనరులపై అధికారికంగా తుది నిర్ధారణ రావాల్సి ఉంది. సోదాల్లో బయటపడిన ఆస్తుల పత్రాలు, ఇతర ఆధారాలను అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. రంగారెడ్డి జిల్లాలో శ్రీనివాస్‌రెడ్డికి 10 ఎకరాలకు పైగా వ్యవసాయ భూమి ఉన్నట్లు ఏసీబీ గుర్తించినట్లు సమాచారం. హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ భూములు, ఇళ్ల స్థలాలు ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. వీటికి సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు, లావాదేవీల వివరాలను ఏసీబీ అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఉద్యోగ జీవితంలో వివిధ రెవెన్యూ హోదాల్లో పనిచేసిన శ్రీనివాస్‌రెడ్డికి హైదరాబాద్, రంగారెడ్డి పరిసర ప్రాంతాల్లో భవనాలు, ఇళ్ల స్థలాలు ఉన్నట్లు దర్యాప్తులో వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. ఆస్తుల కొనుగోలుకు ఉపయోగించిన డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది? వాటిని ఏ ఆదాయ వనరులతో సమకూర్చుకున్నారు? అనే కోణంలోనూ అధికారులు వివరాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. భూములు, ఇళ్ల స్థలాలతో పాటు శ్రీనివాస్‌రెడ్డి కుటుంబానికి సంబంధించిన సుమారు కేజీన్నర బంగారం కూడా ఏసీబీ సోదాల్లో గుర్తించినట్లు సమాచారం. నగలు, ఇతర విలువైన వస్తువులకు సంబంధించిన వివరాలను అధికారులు నమోదు చేసినట్లు తెలుస్తోంది. ఆస్తుల పత్రాలతో పాటు బ్యాంకు ఖాతాలు, ఆర్థిక లావాదేవీలు, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, ఇతర కీలక ఆధారాలను ఏసీబీ అధికారులు పరిశీలిస్తున్నారు. గుర్తించిన ఆస్తులు ఆయనకు తెలిసిన ఆదాయ మార్గాలతో పోలిస్తే ఎంత మేరకు ఎక్కువగా ఉన్నాయనే అంశాన్ని అధికారులు లెక్కించనున్నట్లు సమాచారం. శ్రీనివాస్‌రెడ్డి గతంలో మహేశ్వరం, బాలాపూర్, శంషాబాద్ తహసీల్దార్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో ఆయన పనిచేసిన ప్రాంతాల్లో జరిగిన భూ లావాదేవీలు, ఆస్తుల కొనుగోళ్లకు సంబంధించిన వివరాలు కూడా దర్యాప్తులో భాగంగా మారే అవకాశం ఉంది. ప్రస్తుతం గుర్తించిన ఆస్తులన్నింటినీ విలువ కట్టి, శ్రీనివాస్‌రెడ్డి అధికారిక ఆదాయం, ఖర్చులు, ఆస్తులతో పోల్చి చూడనున్నారు. అనంతరం అక్రమ ఆస్తుల విలువపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. రూ.100 కోట్లకు పైగా ఆస్తుల గుర్తింపు నిజమేనా? ఈ ఆస్తుల వెనుక ఉన్న ఆదాయ మార్గాలేంటి? ఇంకా ఎలాంటి ఆస్తులు బయటపడనున్నాయి? అనే అంశాలపై ఏసీబీ దర్యాప్తు కొనసాగుతోంది. అధికారుల తుది ప్రకటన వెలువడిన తర్వాత శ్రీనివాస్‌రెడ్డికి సంబంధించిన ఆస్తులు, స్వాధీనం చేసుకున్న పత్రాలు, బంగారం, ఇతర విలువైన వస్తువులపై పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

## టిఫిన్ సెంటర్లో అగ్ని ప్రమాదం

**మేడ్చల్ :**

కీసర గ్రామంలో టిఫిన్ సెంటర్లో సిలిండర్ లీకేజీతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఉదయాన్నే టిఫిన్ తయారీ కోసమై సిలిండర్ వెలిగించడంతో ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి అక్కడున్న వారు వెంటనే అప్రమత్తమై బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.




తెలంగాణలో ఎన్నికల సంఘం ప్రత్యేక ఓటరు సవరణ అంటే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ SIR ఓ షాకింగ్ విషయాన్ని బయటపెట్టింది. SIR ముసాయిదా ప్రకటనలో ఏకంగా తెలంగాణలో ఇప్పటికే 73లక్షల ఓట్లనులో పెట్టారు. అంటే ఇప్పటికి వీటిని శాశ్వతంగా తొలగించినట్లే. ఈ జాబితాలో జూన్ నాటికి ఉన్న మొత్తం 3కోట్ల 38లక్షల 26వేల ఓటర్లలో 73లక్షల మందిని పర్మనెంట్‌గా తీసేశారంటే.. పోయిన ఓట్లు ఏకంగా 22శాతం. ఇక మిగిలింది.. 2కోట్ల 65లక్షలు మాత్రమే. మరో 93లక్షల ఓట్లను ఇంకా పెండింగ్‌లోనే ఉంచారు. ఇవన్నీ కూడా 2002 ఓటర్ జాబితాతో మ్యాపింగ్ కానివి.. లేదా ఇతర అనామలీస్ అంటే వాళ్లు చెప్పిన వాటికి అక్కడున్న వివరాలకు తేడాలు ఉన్నవి. అంటే డిజిటైజేషన్ అయిపోయిన ఓట్లలో ఇది 35శాతం. జూన్ 2026 నాటికి తెలంగాణలో మొత్తం ఓట్ల సంఖ్య 3,38, 26,244. ఓటర్ల జాబితాలో చాలా అవకతవకలున్నాయి. డూప్లికేట్ ఓటర్లున్నారు. కొంతమంది ఓట్లు మూడు నాలుగు చోట్ల కూడా ఉందనడానికి అనేక ఉదాహరణలున్నాయి. అంతే కాకుండా బయట నుంచి వచ్చిన అక్రమ వలసదారుల ఓట్లను కూడా తొలగించాలన్న ఉద్దేశ్యంతోనే SIR నిర్వహించారు. అందుకే ఇందులో చాలా పకడ్బందీ నిబంధనలున్నాయి. 1987 కంటే ముందు పుట్టిన వాళ్లు వాళ్ల జన్మ ధృవీకరణ పత్రం..19872004 వరకూ పుట్టినవాళ్లకు వాళ్ల తల్లిదండ్రుల జన్మధృవీకరణ, ఆ తర్వాత జన్మించిన జెన్‌జీలకు వాళ్ల పేరెంట్స్‌తో పాటు..ఓటర్ల జన్మధృవీకరణ తప్పనిసరి చేశారు. అలాగే ఓటు నమోదు చేసుకుంటున్న చోట అక్కడ నివాసానికి సంబంధించిన డాక్యుమెంట్లను పక్కాగా అడిగారు. అవన్నీ అడిగిన తర్వాత చాలా ఓట్లు పోతాయి అనుకున్నారు కానీ.. ఏకంగా 73లక్షల ఓట్లు మాయం అయ్యాయి. ఇది 22శాతం. ఇక్కడితోనే ఆగలేదు.. తెలంగాణలో డిజిటైజేషన్ పూర్తియన ఓట్ల జాబితాలో 2,64,87,213 ఓట్లు ఉన్నాయి. ఇప్పుడు ఇవన్నీ కూడా పర్‌ఫెక్ట్ అని చెప్పడం లేదు ఈసీ. ఎందుకంటే ఇందులో కూడా 92,87,577 ఓట్లను విత్‌హెల్డ్‌లో ఉంచింది. అంటే వీళ్ల వాలిడేషన్ పూర్తికాలేదు. దాదాపు 93లక్షల ఓట్లకు సంబంధించి మ్యాపింగ్‌లో వేరియేషన్స్, అలాగే వీళ్లు సమర్పించిన పత్రాల్లో SIR 2002కు సరిపోకపోవడం వంటి కారణాలున్నాయి. డిజిటైజేషన్ పూర్తి అయిన దాంట్లో 35శాతం. ఇందులో ఎంత వరకూ పరిష్కరించి ఓకే చేస్తారో తెలీదు కానీ.. పూర్తిగా తొలగించిన ఓట్లు, సమస్యలు ఉన్న ఓట్లు మొత్తం కలిపి 1,66,26,812. అంటే జూన్ వరకూ ఉన్న మొత్తం సగం. (49శాతం)జాబితాలో శాశ్వతంగా లేకుండా పోయిన మొత్తం ఓట్లలో 43లక్షలు కోర్ అర్బన్ రీజియన్ CURE పరిధిలో ఉన్నాయి. అంటే హైదరాబాద్ సహా మూడు జిల్లాలతో కూడా ప్రాతం. రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్ కలిపి 43లక్షల ఓట్లు ఇక్కడే పోయాయి. అంతే కాదు.. అభ్యంతరాలు, మ్యాపింగ్ సరిగ్గా అవ్వని ఓట్లు కూడా ఈ మూడు జిల్లాల్లో 39లక్షలు ఉన్నాయి. అంటే తెలంగాణలో పూర్తిగా పోయిన.. పూర్తిగా ఆమోదయోగ్యం కానీ.. కోటీ 60లక్షల ఓట్లలో 83లక్షలు కేవలం మూడు జిల్లాల పరిధిలో ఉన్నాయి.

**కారణాలు ఇవేనా..?**

ఈ స్థాయిలో కోర్ అర్బన్ ప్రాంతంలో ఓట్ల జాబితాలో సమస్యలు ఉండటానికి చాలా కారణాలు కనిపిస్తున్నాయి.

హైదరాబాద్ మెట్రో సిటీ అవ్వడం వల్ల తెలంగాణతో సహా ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడకు వచ్చిన వారు... పెద్ద సంఖ్యలో ఉన్నారు. వీరిలో చాలా మంది SIR ప్రక్రియ వల్ల తమ ఓట్లను తమ ప్రాంతంలోనే రిజిస్టర్ చేసుకోవాలనుకుంటున్నారు.

ఆంధ్ర ప్రాంతంలో ఉన్నవారికి ఎక్కువ మందికి తెలంగాణ, ఆంధ్ర రెండు చోట్ల ఓట్లు ఉన్నాయి. ఇప్పుడు ఎక్కడైనా ఒక్క ఓటే ఉండే అవకాశం ఉండటంతో వీళ్లలో ఎక్కువ మంది తమ మూలాలు ఉన్న ప్రాంతంలో ఓట్లను ఎంపిక చేసున్నారు.

తెలంగాణలో ఇతర జిల్లాల నుంచి హైదరాబాద్‌కు ఉపాధి కోసం వచ్చిన వాళ్లు కూడా తమ సొంత జిల్లాలో ఓట్లను కాపాడుకునేదుకు హైదరాబాద్‌లో ఓటును వదిలేశారు.

ఇక హైదరాబాద్ పాతబస్తీ ప్రాంతంలో చాలా మందికి సరైన పత్రాలు లేవు. అందుకే ఓటరు జాబితా రివిజన్‌లో ఎక్కువ మంది తిరిగి పత్రాలు ఇవ్వలేదు.

రాష్ట్రవ్యాప్తంగా 73లక్షల ఓట్లు తొలగిస్తే.. అందులో 19లక్షలు ఒక్క హైదరాబాద్ జిల్లాలో (గ్రేటర్ హైదరాబాద్ కాదు..) ఉన్నాయి. పాతబస్తీ కవర్ అయ్యే హైదరాబాద్‌లో 47లక్షలకు పైగా ఓటర్లున్నారు. అందులో దాదాపు 40శాతం అంటే 19లక్షల మంది తిరిగి రిజిస్టర్ చేసుకోలేదు.

అలాగే ఇప్పుడు జాబితాలో ఉన్న ఓటర్లలో కూడా సమస్యలున్నాయి. వీళ్లంతా కూడా సర్‌లో పత్రాలు సమర్పించలేకపోయారు. పాతబస్తీ ప్రాంతం మొత్తం కవర్ అయ్యే హైదరాబాద్ జిల్లాలో 6,70వేల మందికి అనామలీస్ ఉంటే.. మరో 6లక్షలమందికి మ్యాపింగ్ లేదు.

ఇంకో ముఖ్యమైన విషయం ఏంటంటే.. ఈ SIR ప్రక్రియ జరుగుతున్నప్పుడే.. కొత్త ఓటర్లు కూడా నమోదు చేసుకున్నారు. వాళ్ల సంఖ్య చేర్చిన తర్వాత కూడా నాలుగో వంతు ఓట్లు పోయాయి.

## చర్చలతోనే చెక్

అన్ని రాష్ట్రాలకు ఒకే విధమైన నిబంధనలు వర్తింపజేయడమని ఆయన వివరించారు. ఇదే క్రమంలో కృష్ణా జలాల పంపిణీపై మాట్లాడుతూ.. ఈ నీటి విషయంలో తెలంగాణ రాష్ట్రం ఎలాంటి ప్రత్యేక ప్రయోజనాన్ని కోరడం లేదని స్పష్టం చేశారు. కేవలం ఇప్పటికే ఏర్పాటైన న్యాయపరమైన వ్యవస్థల ద్వారా రాష్ట్రానికి చట్టబద్ధంగా దక్కాల్సిన న్యాయమైన వాటాను మాత్రమే అడుగుతున్నామని చెప్పారు. దిగువ రాష్ట్రాల హక్కులకు నష్టం కలిగించేలా ఏకపక్ష చర్యలు తీసుకోకుండా అడ్డుకోవాల్సిన అవసరం ఉందని ఆయన ఉద్ఘాటించారు. కృష్ణా జలాల పంపకాల అంశం ఇప్పటికే కృష్ణా వాటర్ డిస్ప్యూట్స్ ట్రిబ్యునల్ పరిధిలో పరిశీలనలో ఉన్నందున, పాలమూరు-రంగారెడ్డి, నక్కలగండి ఎత్తిపోతల ప్రాజెక్టుల అంశాలను కూడా ఏర్పాటు చేసిన న్యాయ ప్రక్రియ ద్వారానే సామరస్యంగా పరిష్కరించాలని తెలంగాణ ప్రభుత్వం గట్టిగా కోరుతోందన్నారు. రాష్ట్రంలోని కీలక ప్రాజెక్టులైన కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు కేంద్రం తక్షణమే తగిన ఆర్థిక సహకారం అందించాలని భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, అలాగే తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును మళ్లీ పునరుద్ధరించే ప్రక్రియను వేగంగా ముందుకు తీసుకెళ్తున్నామని ఆయన ఈ సదస్సులో వెల్లడించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో మిగిలిపోయిన పనులను త్వరగా పూర్తి చేసి, ఆ పథకాన్ని పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం ఉదారంగా సహకరించాలని కోరారు. ఇక ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 అమలులోకి వచ్చి 12 ఏళ్లు పూర్తవుతున్నా రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఇంకా అనేక సమస్యలు పరిష్కారం కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వీటికి చట్టం, న్యాయపరమైన నిబంధనలకు అనుగుణంగా త్వరగా తుది పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. పరిష్కారం పేరుతో అంతులేని ఉత్తర ప్రత్యుత్తరాలు, కొన్నేళ్లకొకసారి కొత్త వివరణలు ఇచ్చుకునే పద్ధతి ఇకమీదట ఉండకూడదని స్పష్టం చేశారు. షెడ్యూల్ 9లోని ప్రభుత్వ కంపెనీలు, కార్పొరేషన్ల విభజన ఇంకా పెండింగ్‌లోనే ఉందని, ప్రధాన కార్యాలయాలతో పాటు ఇతర అంశాలపై విభేదాల కారణంగా ఈ ప్రక్రియ పూర్తికాలేదని ఆయన సదస్సు దృష్టికి తీసుకెళ్లారు. మొత్తం 23 షెడ్యూల్ 9 సంస్థలపై తెలంగాణ ఇప్పటికే తమ అభిప్రాయాలను కేంద్ర హోంశాఖకు సమర్పించిందని, చట్ట నిబంధనల ప్రకారం ఆ సమస్యను పరిష్కరించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని ప్రకటించారు. కొన్ని షెడ్యూల్ 10 సంస్థల ఆస్తుల విభజనకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేస్తున్న డిమాండ్లను తెలంగాణ తీవ్రంగా వ్యతిరేకించింది. పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 75 కింద కేవలం ఆయా సంస్థల సేవల కొనసాగింపునకు మాత్రమే అవకాశం ఉందని, ఆస్తుల విభజనకు ఆ చట్టంలో ఎలాంటి ఆధారం లేదని తెలంగాణ తన వైఖరిని కుండబద్దలు కొట్టినట్లు వెల్లడించింది. ఈ సున్నితమైన అంశం ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పరిధిలో కూడా పెండింగ్‌లో ఉన్నందున, న్యాయ ప్రక్రియకు అనుగుణంగానే దీనిని పరిష్కరించుకోవాలని తెలంగాణ సూచించింది. రాబోయే రోజుల్లో దక్షిణాది రాష్ట్రాల మధ్య ఐక్యత, సహకారం మరింత పెరగాల్సిన ఆవశ్యకత ఉందని భట్టి విక్రమార్క ఆకాంక్షించారు. నీటి భద్రత, ఇంధనం, వాతావరణ మార్పులను ఎదుర్కొనే సామర్థ్యం, పట్టణీకరణ, లాజిస్టిక్స్, ఆర్థిక పోటీతత్వం లాంటి కీలక అంశాలు రాష్ట్రాల సరిహద్దులను దాటి తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆయన విశ్లేషించారు. దక్షిణ భారతదేశం అంతా కలిసికట్టుగా అభివృద్ధి చెందితే, అప్పుడు మొత్తం దేశం మరింత వేగంగా ప్రగతి పథంలో పయనిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తదుపరి నిర్వహించబోయే 32వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశానికి హైదరాబాద్ నగరంలో ఆతిథ్యం ఇచ్చేందుకు తెలంగాణ పూర్తి సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సగర్వంగా ప్రకటించారు. కృష్ణా జలాల లాంటి సుదీర్ఘమైన అంశాలు మళ్లీ ట్రిబ్యునల్ చుట్టూ తిరగకుండా, కొత్త కమిటీల అవసరం లేకుండా, మరో దఫా ఉత్తర ప్రత్యుత్తరాలకు తావులేకుండా సామరస్యంగా పరిష్కారం కావాలని ఆయన మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ తదుపరి భేటీకి అన్ని దక్షిణాది రాష్ట్రాలను అత్యంత ఆప్యాయత, సహకారంతో ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఈ జోనల్ కౌన్సిల్ ప్రసంగం ద్వారా తెలంగాణ తమ హక్కుల సాధనలో ఏమాత్రం రాజీపడేది లేదన్న స్పష్టమైన వైఖరిని, అదే సమయంలో సమస్యల పరిష్కారంలో నిర్మాణాత్మక దృక్పథాన్ని దేశం ముందు ఉంచింది. కృష్ణా జలాల్లో దక్కాల్సిన న్యాయమైన వాటా, రాష్ట్ర ప్రధాన సాగునీటి ప్రాజెక్టులకు కేంద్ర ఆర్థిక సహకారం, పెండింగ్‌లో ఉన్న పునర్వ్యవస్థీకరణ సమస్యలకు నిర్దిష్ట కాలపరిమితిలో శాశ్వత పరిష్కారం, చట్ట నిబంధనలకు పూర్తి కట్టుబాటు, అన్ని రాష్ట్రాలకు సమాన న్యాయం, దక్షిణాది రాష్ట్రాల మధ్య మరింత స్నేహపూర్వక సహకారం.. ఇవే తెలంగాణ ప్రధాన డిమాండ్లని ఆయన తన ప్రసంగం ద్వారా పాలకులకు సుస్పష్టం చేశారు. విభిన్న ప్రయోజనాలు ఉండటం సమాఖ్య విధానానికి ఎప్పుడూ ఆటంకం కాదని, ఆ విభిన్న ప్రయోజనాలను న్యాయబద్ధంగా, సమర్థవంతంగా సమన్వయం చేసే పటిష్టమైన సంస్థలు ఉండటమే అసలైన సహకార సమాఖ్య విధానానికి నిదర్శనం అని భట్టి విక్రమార్క తన ప్రసంగాన్ని ముగించారు.

## రక్షణ ఒప్పందం

మధ్య సహకారం బలోపేతం అవుతుంది. ఇండోపసిఫిక్‌లో శాంతి, స్థిరత్వం, శ్రేయస్సుకు భారత్‌జపాన్ ప్రత్యేక వ్యూహాత్మక, ప్రపంచ భాగస్వామ్యం ఓ కీలకమైన స్తంభం అని ఇరు దేశాల రక్షణ మంత్రులు ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. సముద్ర భద్రత, నౌకాదళ సహకారం, రక్షణ పరికరాలు, సాంకేతికత, సైనిక విన్యాసాలు, రక్షణ పరిశ్రమ రంగాలలో సహకారాన్ని పెంపొందించుకోవడానికి ఇద్దరు మంత్రులు అంగీకరించారు. జులై 2026లో ఇరు దేశాల నాయకులు జారీ చేసిన సంయుక్త ప్రకటనను ఇరుపక్షాలు గుర్తుచేసుకున్నాయి. స్వేచ్ఛాయుత, బహిరంగ ఇండోపసిఫిక్ లక్ష్యాన్ని సాధించేందుకు రక్షణ సహకారాన్ని మరింతగా పెంపొందించుకోవడానికి తాము కట్టుబడి ఉన్నామని ఇరు దేశాల రక్షణ మంత్రులు పునరుద్ఘాటించారు. ప్రస్తుత ప్రపంచ ఉద్రిక్తతల నేపథ్యంలో, ప్రాంతీయ, అంతర్జాతీయ భద్రతా పరిస్థితిపై అంచనాలను పంచుకోవాల్సిన ప్రాముఖ్యతను ఇద్దరు రక్షణ మంత్రులు స్పష్టం చేశారు. నౌకాయానం, విమానయాన స్వేచ్ఛ, భద్రతకు ఆటంకం కలిగించే ఏకపక్ష చర్యలను వారు తీవ్రంగా వ్యతిరేకించారు. అంతేకాకుండా గాలింపు, సహాయక చర్యలు, మానవతా సహాయం, విపత్తు సహాయక చర్యల రంగాలలో సహకారాన్ని మరింతగా పెంపొందించనున్నారు. భారత, జపాన్ రక్షణ మంత్రుల ద్వైపాక్షిక సమావేశం సముద్ర సమాచార మార్గాలను రక్షించడానికి ఇరుపక్షాలు నౌకాదళ నౌకలు, సైనిక విభాగాల పరస్పర సందర్శనలను పెంచుతాయి. సంయుక్త విన్యాసాలు, సైనిక సిబ్బంది, నిపుణుల మార్పిడి కూడా నిర్వహించబడతాయి. ఓడరేవుల వినియోగం, నిర్వహణ, మరమ్మతు సౌకర్యాల విషయంలో కూడా సహకారాన్ని పెంపొందించుకుంటారు. నౌకా నిర్మాణ రంగంలో సహకారానికి ఉన్న అవకాశాలను కూడా విస్తరిస్తారు. సముద్ర భద్రతా సహకారాన్ని వేగంగా ముందుకు తీసుకెళ్లడానికి ఇద్దరు మంత్రులు అంగీకరించారు. జపాన్ సాంకేతిక నైపుణ్యం, భారతదేశ ఉత్పత్తి సామర్థ్యాలను వినియోగించుకుని, నౌకాదళ నౌకల సంయుక్త అభివృద్ధి, రూపకల్పన అవకాశాలను అన్వేషించడానికి కూడా ఇరుపక్షాలు అంగీకరించాయి. రక్షణ నౌకా నిర్మాణానికి సంబంధించిన రంగాలలో ఒకరి సామర్థ్యాలను మరొకరు వినియోగించుకోవాల్సిన అవసరాన్ని భారత్, జపాన్ స్పష్టం చేశారు. 'మేక్ ఇన్ ఇండియా' చొరవ కింద భారతదేశ ఉత్పత్తి సామర్థ్యాలను వినియోగించుకోవడంపై చర్చలను కూడా ముందుకు తీసుకెళ్లనున్నారు. సమీప భవిష్యత్తులో నౌకా మరమ్మతు సౌకర్యాలను పరస్పరం వినియోగించుకునేందుకు ఏర్పాట్లను ఖరారు చేయడానికి కూడా ఇరుపక్షాలు అంగీకరించాయి.

భారత్, జపాన్‌ల మధ్య పెరుగుతున్న సైనిక విన్యాసాలను ఇద్దరు మంత్రులు స్వాగతించారు. "ధర్మ గార్డియన్", "జామెక్స్" వంటి విన్యాసాలను మరింత విస్తరించనున్నారు. ఈ ఏడాది జరగనున్న భారత్‌జపాన్ వైమానిక దళ విన్యాసం "వాలర్ గార్డియన్ 26" సన్నాహాల్లో సాధించిన పురోగతిని కూడా వారు స్వాగతించారు. తొలిసారిగా జపాన్ వైమానిక స్వీయరక్షణ దళానికి చెందిన యుద్ధ విమానాలు భారత్‌కు వచ్చి ఈ విన్యాసంలో పాల్గొననున్నాయి. సైనిక విన్యాసాలను మరింత విస్తరించడానికి, మానవరహిత వ్యవస్థలను చేర్చడానికి, అవకాశాలు లభించినప్పుడు తక్కువ వ్యవధిలో సంయుక్త విన్యాసాలు నిర్వహించడానికి కూడా ఇరు దేశాలు అంగీకరించాయి.

భారత్, జపాన్‌ల మధ్య ఈ రక్షణ ఒప్పందం, జపాన్ హిందూ మహా సముద్రంలో తన ఉనికిని బలోపేతం చేసుకోవడానికి నిరంతరం ప్రయత్నిస్తున్న సమయంలో కుదిరింది. అమెరికా కూడా ఈ ప్రాంతంపై కన్నేసింది. ఇటీవల అమెరికా, చైనాలు కొత్త ప్రాంతాలలో తమ ప్రభావాన్ని విస్తరిస్తున్న నేపథ్యంలో, భారత్ మౌనంగా ఉండలేదు. అందుకే భారత్‌కు దగ్గరవ్వాలనుకుంటున్న దేశాలతో సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ బలమైన పొత్తు పొరుగున ఉన్న పాకిస్థాన్ కు దౌత్యపరమైన గట్టి ఎదురుదెబ్బగా విశ్లేషకులు భావిస్తున్నారు.



## స్పాట్ అడ్మిషన్ల హడావిడి

**✍ జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 20 :**

ఈఏపీసెట్ మూడో విడత కౌన్సెలింగ్ ముగిసిన నేపథ్యంలో, జేఎన్టీయూ పరిధిలోని అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. విద్యార్థుల నుంచి భారీ స్పందన లభిస్తుండటంతో ఈ సీట్లు వేగంగా భర్తీ అవుతున్నాయి హైదరాబాద్‌లోని యూనివర్సిటీ అడ్మిషన్ల కార్యాలయంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు సుమారు 200 మంది విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి హాజరయ్యారు. దీంతో క్యాంపస్ ప్రాంగణమంతా విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సందడిగా మారింది.విద్యార్థుల నుంచి భారీ స్పందన లభిస్తుండటంతో ఈ సీట్లు వేగంగా భర్తీ అవుతున్నాయి. హైదరాబాద్‌లోని యూనివర్సిటీ అడ్మిషన్ల కార్యాలయంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు సుమారు 200 మంది విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి హాజరయ్యారు. దీంతో క్యాంపస్ ప్రాంగణమంతా విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సందడిగా మారింది.కౌన్సెలింగ్ ప్రారంభమైన కొద్దిసేపటికే జేఎన్టీయూ హైదరాబాద్‌లోని 26 సీట్లు, సుల్తాన్‌పూర్‌లోని 8 సీట్లు పూర్తిగా భర్తీ అయ్యాయి. ఇక జగిత్యాల కళాశాలలోని రెండు సీట్లలో ఒకటి భర్తీ అయింది. సీట్లు శరవేగంగా భర్తీ అవుతున్నాయని అడ్మిషన్ల డైరెక్టర్ బాలునాయక్ వెల్లడించార మంథని, సిరిసిల్ల, పాలేరు కళాశాలలకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. శుక్రవారం) వనపర్తి, కోస్గి, మహబూబాబాద్ కళాశాలలకు అడ్మిషన్ల ప్రక్రియ ఉంటుంది. ఈ కౌన్సెలింగ్ మొత్తం హైదరాబాద్ క్యాంపస్‌లోనే జరుగుతుందని అధికారులు తెలిపారు.సీట్ల కేటాయింపును ఈఏపీసెట్ ర్యాంకు, రిజర్వేషన్ కేటగిరీ మరియు ఇంటర్మీడియట్ మార్కుల మెరిట్ ఆధారంగా చేపడుతున్నారు. ఉదయం 10 గంటల తర్వాత వచ్చిన అభ్యర్థులకు 'ముందు వచ్చిన వారికి మొదటి ప్రాధాన్యత' ప్రాతిపదికన అవకాశం కల్పిస్తారు. విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికేట్లు, అవసరమైన ఫీజుతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని అధికారులు సూచించారు.

## పుష్కరాల కోసం మున్సిపల్ శాఖకు ఆర్థిక శాఖ రూ.150 కోట్లు

- మంత్రి నారాయణ

**✍ జయభేరి, అమరావతి :**

శాసనమండలిలో 'గోదావరి పుష్కరాల నిధుల'పై ఎమ్మెల్సీ సోము వీర్రాజు అడిగిన ప్రశ్నకు మంత్రి నారాయణ సమాధానమిచ్చారు. రాబోయే గోదావరి పుష్కరాల కోసం మున్సిపల్ శాఖకు ఆర్థిక శాఖ రూ.150 కోట్లు కేటాయించింది. కేంద్రం నిధుల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు గారు ఇప్పటికే లేఖ రాసారు. ఇవి గాకుండా UIDF, UCF వంటి పథకాల ద్వారా పుష్కరాలు జరిగే ప్రాంతాల మునిసిపాలిటీలకు రూ.1,144 కోట్లు కేటాయించామని అన్నారు.

# వరలక్ష్మీదేవి.. అనుగ్రహించు..

- నేడు వరలక్ష్మీ వ్రతం

**జయభేరి, దేవరకద్ర :**

అష్టలక్ష్ముల అనుగ్రహం పొందాలంటే.. శ్రావణ మాసంలో అత్యంత పవిత్రంగా భావించే వరలక్ష్మీ వ్రతానికి ప్రత్యేకమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉంది. అష్టలక్ష్ముల అనుగ్రహానికి ప్రతీకగా భావించే వరలక్ష్మీదేవి ఆరాధన, చారుమతి వ్రత కథ, పూజలోని అంతరార్థం, స్త్రీలోని లక్ష్మీ స్వరూపం గురించి ఈ కథనంలో తెలుసుకుందాం.శ్రావణ మాసం అంటేనే ఆధ్యాత్మిక శోభ, పూజలు, వ్రతాలు, మంగళకార్యాలతో కళకళలాడే పవిత్ర కాలం. ఈ మాసంలో వచ్చే ప్రతి శుక్రవారం ఎంతో విశిష్టమైనదిగా భావిస్తారు. అందులోనూ శ్రావణ శుక్రవారాల్లో ఆచరించే వరలక్ష్మీ వ్రతానికి ప్రత్యేకమైన స్థానం ఉంది. సౌభాగ్యం, ఐశ్వర్యం, ఆరోగ్యం, సంతానం, సుఖసంతోషాలు ప్రసాదించే తల్లిగా వరలక్ష్మీదేవిని భక్తులు కొలుస్తారు. వరలక్ష్మీ అంటే 'వరాలను ప్రసాదించే లక్ష్మీ' అని అర్థం. సంపదకు మాత్రమే కాకుండా జీవితాన్ని సుఖమయం చేసే అనేక శుభ ఫలాలకు ఆమె ప్రతిరూపంగా భావిస్తారు. అందుకే వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించే కుటుంబాల్లో ఆధ్యాత్మిక ఆనందంతో పాటు మంగళకరమైన వాతావరణం నెలకొంటుందని విశ్వాసం. అష్టలక్ష్ముల అనుగ్రహానికి ప్రతీక.. లక్ష్మీదేవి అనేక రూపాల్లో భక్తులను అనుగ్రహిస్తుందని పురాణ సంప్రదాయం చెబుతుంది. ఆదిలక్ష్మి ఆధ్యాత్మిక శక్తికి, ధనలక్ష్మి సంపదకు, ధాన్యలక్ష్మి ఆహార సమృద్ధికి, గజలక్ష్మి రాజసౌభాగ్యానికి, సంతానలక్ష్మి సంతానాభివృద్ధికి, ధైర్యలక్ష్మి ఆత్మవిశ్వాసానికి, విజయలక్ష్మి విజయాలకు, విద్యాలక్ష్మి జ్ఞానానికి ప్రతీకలుగా భావిస్తారు. ఈ శుభశక్తులన్నింటినీ ఒకే దైవస్వరూపంలో దర్శించుకునే ఆరాధనగా వరలక్ష్మీ వ్రతాన్ని భక్తులు భావిస్తారు. అందుకే ఈ వ్రతాన్ని కేవలం ధనప్రాప్తి కోసం చేసే పూజగా కాకుండా, కుటుంబ జీవితంలోని అన్ని రంగాల్లో శ్రేయస్సును కోరుకునే ఆధ్యాత్మిక సాధనగా చూడవచ్చు.

**ప్రతి ఇంటా లక్ష్మీ స్వరూపమే స్త్రీ**

భారతీయ సంస్కృతిలో స్త్రీని లక్ష్మీ స్వరూపంగా భావించే సంప్రదాయం ఉంది. కుటుంబానికి ఆప్యాయతను అందించే తల్లిగా, బాధ్యతలను నిర్వహించే ఇల్లాలిగా, వృత్తిపరమైన రంగంలో రాణించే మహిళగా, అవసరమైనప్పుడు కుటుంబానికి అండగా నిలిచే నాయకురాలిగా స్త్రీ అనేక పాత్రలను సమర్థంగా నిర్వర్తిస్తుంది. అందుకే వరలక్ష్మీ వ్రతం సందర్భంగా దేవతను అలంకరించడంతో పాటు మహిళలు కూడా సంప్రదాయబద్ధంగా అలంకరించుకుని పూజలో పాల్గొంటారు. ఇది కేవలం అలంకరణకు సంబంధించిన ఆచారం మాత్రమే కాదు; స్త్రీలోని శక్తి, సహనం, మాతృత్వం, ధైర్యం, జ్ఞానం, మంగళత్వాన్ని గౌరవించే ప్రతీకగా కూడా దీనిని భావించవచ్చు.పార్వతీదేవికి పరమేశ్వరుడు వివరించిన వ్రతం.. వరలక్ష్మీ వ్రతానికి సంబంధించిన ప్రసిద్ధ పురాణ గాథలో పార్వతీదేవి తన భర్త పరమేశ్వరుడిని స్త్రీలకు శుభసౌభాగ్యాలను





ప్రసాదించే వ్రతం గురించి అడిగినట్లు చెబుతారు. కుటుంబంలో సుఖశాంతులు నెలకొని, సంతానం వృద్ధి చెంది, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు సమకూరేందుకు అనుసరించదగిన వ్రతం ఏమిటని పార్వతీదేవి ప్రశ్నించగా, పరమేశ్వరుడు వరలక్ష్మీ వ్రత మహిమను వివరించినట్లు పురాణ కథనం చెబుతుంది. శ్రావణ మాసంలోని శుభశుక్రవారం ఈ వ్రతాన్ని ఆచరించాలని, నియమ నిష్ఠలతో లక్ష్మీదేవిని పూజించాలని ఆయన ఉపదేశించినట్లు సంప్రదాయం చెబుతోంది.

**చారుమతి భక్తి.. వరలక్ష్మీ అనుగ్రహం**

వరలక్ష్మీ వ్రత మహిమను తెలియజేసే కథల్లో చారుమతి కథకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. పతిభక్తి, కుటుంబ బాధ్యత, దైవభక్తి కలిగిన చారుమతిని లక్ష్మీదేవి అనుగ్రహించినట్లు ఈ కథనం వివరిస్తుంది. ఒక సందర్భంలో లక్ష్మీదేవి చారుమతికి స్వప్నంలో దర్శనమిచ్చి తనను వరలక్ష్మీ రూపంలో ఆరాధించాలని సూచించినట్లు కథనం. దేవి ఆదేశాన్ని శిరసావహించిన చారుమతి కుటుంబ సభ్యులు, ఇతర మహిళలతో కలిసి భక్తిశ్రద్ధలతో వ్రతాన్ని ఆచరించింది. పూజ అనంతరం వారికి దేవి అనుగ్రహంతో శుభఫలాలు కలిగినట్లు పురాణ గాథ చెబుతుంది. ఈ కథలోని ప్రధాన సందేశం భక్తి, నియమం, నిష్ఠతో చేసే దైవారాధన మనిషిలో సానుకూలతను, ధైర్యాన్ని, విశ్వాసాన్ని పెంచుతుంది అన్నదే. వ్రతం అంటే కేవలం పూజ కాదు.. 'వ్రతం' అనే పదానికి నియమం, సంకల్పం అనే అర్థాలు ఉన్నాయి. ఒక నిర్దిష్టమైన ఆధ్యాత్మిక లక్ష్యాన్ని మనసులో పెట్టుకుని నియమబద్ధంగా జీవించడమే వ్రతసారాంశం. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ఇంటిని శుభ్రపరచడం, పూజా స్థలాన్ని అలంకరించడం, కలశాన్ని ప్రతిష్ఠించడం, లక్ష్మీదేవిని ఆవాహన చేయడం, పుష్పాలు, పసుపు, కుంకుమ, నైవేద్యాలతో పూజించడం వంటి సంప్రదాయాలు పాటిస్తారు.

అయితే పూజా విధానంతో పాటు మనస్సులో భక్తి, మాటల్లో మాధుర్యం, చేతల్లో సేవాభావం, జీవనంలో నియమం ఉండటం కూడా వ్రతానికి అంతరార్థం. దైవారాధన ద్వారా మనలోని చెడు ఆలోచనలను తొలగించుకుని మంచి మార్గంలో నడవాలనే సంకల్పమే వ్రతానికి నిజమైన పరిపూర్ణతను ఇస్తుంది.

**పసుపు, కుంకుమలతో పండుగ వాతావరణం**

శ్రావణ శుక్రవారం ఉదయం నుంచే అనేక ఇళ్లలో పండుగ వాతావరణం కనిపిస్తుంది. ఇంటి ముంగిట ముగ్గులు, పసుపు కుంకుమలతో అలంకరణలు, పూలతోరణాలు, మంగళవాయిద్యాల శబ్దాలు ఆధ్యాత్మిక శోభను పెంచుతాయి. వరలక్ష్మీదేవిని అందంగా అలంకరించి, పట్టువస్త్రాలు, పుష్పాలు, ఆభరణాలతో శోభాయమానంగా తీర్చిదిద్దుతారు. పూజ అనంతరం ముత్తైదువులను ఇంటికి ఆహ్వానించి తాంబూలం, వాయనం అందించడం అనేక ప్రాంతాల్లో కొనసాగుతున్న సంప్రదాయం. ఈ ఆచారం ద్వారా పరస్పరం ప్రేమను పంచుకోవడం, స్త్రీల మధ్య సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడం, పెద్దల ఆశీర్వాదాలను స్వీకరించడం వంటి విలువలు బలపడతాయి.వరలక్ష్మీ వ్రతం అందించే ఆధ్యాత్మిక సందేశం.. వరలక్ష్మీ వ్రతం మనకు సంపదకు ఉన్న అసలైన అర్థాన్ని కూడా గుర్తుచేస్తుంది. డబ్బు, బంగారం మాత్రమే ఐశ్వర్యం కాదు. ఆరోగ్యం, విద్య, మంచి కుటుంబ సంబంధాలు, సంతానం, ధైర్యం, జ్ఞానం, సంతృప్తి, ప్రశాంతమైన మనసు కూడా జీవితంలోని గొప్ప సంపదలే. అష్టలక్ష్ముల రూపాల వెనుక దాగి ఉన్న సందేశం ఇదే. జీవితంలో ఒక రంగంలో మాత్రమే అభివృద్ధి కాకుండా, సర్వతోముఖమైన శ్రేయస్సు కలగాలని కోరుకోవడమే లక్ష్మీ ఆరాధనలోని అంతరార్థం.

**భక్తితో చేసే ఆరాధనే అసలైన సంపద**

వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ప్రతి భక్తుడు తనకు మాత్రమే కాకుండా కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు, సమాజంలోని ప్రతి ఒక్కరికీ శుభం కలగాలని ప్రార్థిస్తాడు. మన చుట్టూ ఉన్నవారు సుఖంగా ఉంటేనే మన జీవితంలోనూ సంపూర్ణ ఆనందం ఉంటుందనే భావన ఈ ఆరాధనలో కనిపిస్తుంది. అందుకే వరలక్ష్మీ వ్రతాన్ని కేవలం ఒక ఆచారంగా కాకుండా భక్తి, కుటుంబ ఐక్యత, దానధర్మం, సౌభ్రాతృత్వం, సానుకూల జీవనానికి ప్రతీకగా భావించవచ్చు. శ్రావణ మాసంలోని ఈ పవిత్ర సందర్భంలో వరలక్ష్మీదేవిని భక్తిశ్రద్ధలతో స్మరించి, మన ఇళ్లలో శాంతి, మనసుల్లో ధైర్యం, జీవితాల్లో సంతృప్తి, కుటుంబాల్లో సౌభాగ్యం నెలకొనాలని ప్రార్థిద్దాం.



**వరాలను ప్రసాదించే వరలక్ష్మి**

**తరిమళ హరిశంకర శర్మ,**
**ప్రధాన అర్చకుడు**

వరాలను ప్రసాదించే వరలక్ష్మీ తల్లి కరుణా కటాక్షాలు ప్రతి కుటుంబంపైనా ఉండాలని కోరుకుందాం. ఈ కథనంలోని పురాణ, ఆధ్యాత్మిక విషయాలు సంప్రదాయ విశ్వాసాలు, పురాణ కథనాలు, ధార్మిక ఆచారాల ఆధారంగా అందించబడ్డాయి. ప్రాంతీయ సంప్రదాయాలు, పూజా విధానాల్లో భేదాలు ఉండవచ్చు. వ్యక్తిగత నిర్ణయాలు తీసుకునే ముందు సంబంధిత నిపుణులను సంప్రదించడం మంచిది.



## నిరంజన్ కు ఘన సన్మానం

**దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మున్సిపాలిటీ టి ఆర్ పి రాజ్యాధికారం పార్టీ పట్టణ అధ్యక్షుడు నిరంజన్ ను గురువారం స్థానిక కురువ గేరి యువకులు ఘనంగా సన్మానించారు. దేవరకద్ర తెలంగాణ మున్సిపల్ టి ఆర్ పి రాజ్యాధికారం పార్టీ టౌన్ అధ్యక్షుడిగా ఆయన నియమింప బడినందుకు వారు ఈ సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కురువగేరి యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కొండల్ ను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే ఆల దంపతులు



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మున్సిపాలిటీ 11వ వార్డు(రైల్వే స్టేషన్ ఏరియా) కౌన్సిలర్ వడ్డే రాధ భర్త బి ఆర్ ఎస్ పార్టీ నాయకుడు కొండల్ గురువారం దేవరకద్ర నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ఆశీర్వాదం తీసుకున్నారు. కొండల్ జన్మదిన సందర్భంగా హైదరాబాద్ కు వెళ్లి మాజీ ఎమ్మెల్యే ఆల దంపతులను కలిశారు. ఈ సందర్భంగా వారి ఆశీర్వాదం తీసుకున్నారు. జన్మదిన వేడుకలు సందర్భంగా కొండల్ ను మాజీ ఎమ్మెల్యే ఆల దంపతులు శాలువా కప్పి సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి



**జయభేరి, మేడ్చల్:**

ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు, అవసరమైన మేరకు ఉపాధ్యాయులను నియమించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టపస్) మేడ్చల్ మండల శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు లావుడియా శ్రీదేవికి సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయుల కొరతను పరిష్కరించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో టపస్ రాష్ట్ర కార్యదర్శి గడప నవీన్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి నమ్మి తిరుపతి, అత్వెల్లి స్కూల్ కాంప్లెక్స్ ఇన్‌చార్జి శ్రీమతి పెంటమ్మ పాల్గొన్నారు.

## ఇందిరాపార్క్ మహా ధర్నాకు భారీగా తరలిరావాలి



**జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 20 :**

చలో ఇందిరాపార్క్ మహాధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి పోతరాజు జహంగీర్ అన్నారు. గురువారం తుర్కపల్లి మండల కేంద్రంలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భువనగిరి జిల్లా నూతనంగా ఏర్పడి శతాబ్దం అవుతున్నప్పటికీ జిల్లాలో ఇంతవరకు ఏ ఒక్క సాగునీటి ప్రాజెక్టు పురోగతి సాధించలేదన్నారు. జిల్లాకు వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా ఉంది లక్షలాది మంది సన్నకారు మధ్యతరగతి రైతాంగం ఆధారపడి తమ కుటుంబాలు గురవుతున్నాయని అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులకు నిధుల సాధనకై డిమాండ్ చేస్తూ ఆగస్టు 29 ,30 ,31 తేదీల్లో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు 29న భువనగిరి అంబేద్కర్ విగ్రహం నుండి పాదయాత్ర ప్రారంభమై 31న ఇందిరాపార్క్ వరకు చేరుకొని మహా ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, 31న జరిగే చేలో హైదరాబాద్ ఇందిరాపార్క్ మహా ధర్నాకు వేలాదిగా రైతులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు గడ్డమీది నరసింహ, తలారి మాతయ్య , తూటి వెంకటేశం, ఆవుల కలమ్మ, ఆటో శ్రీను, కూరెళ్ళ విష్ణు, తాటికొండ మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## బావిలోకి దూసుకెళ్లిన కారు

**జయభేరి, సిద్దిపేట :**

దుబ్బాక మండలం అప్పనపల్లిలో బుధవారం అర్ధరాత్రి కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న బావిలో పడిపోయింది. ఈ దారుణ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన భార్యాభర్తలతో పాటు వారి ఇద్దరు చిన్న పిల్లలు దుర్మరణం పాలయ్యారు. మృతులను బలవంతపూర్ గ్రామానికి చెందిన భాగ్య, రాజు దంపతులు మరియు వారి పిల్లలు నియాన్ష్, శాన్వికగా పోలీసులు గుర్తించారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ప్రాణాలు కోల్పోవడంతో బలవంతపూర్ గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి.



## భక్తిశ్రద్ధలతో పసలమారమ్మ అమ్మవారి పండగ వేడుకలు

**జయభేరి, పరవాడ:**

పరవాడ మండలం రావాడ పంచాయతీ పరిధిలోని జల్లెలపాలెం గ్రామంలో వేంచేసియున్న పసల మారమ్మ అమ్మవారి పండగ వేడుకలు గురువారం అత్యంత వైభవంగా,భక్తిశ్రద్ధలతో జరిగాయి.ఈ ఉత్సవాల్లో రావాడ పంచాయతీలోని పరిసర గ్రామాల ప్రజలందరూ విశేష సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అమ్మవారి కృపాకటాక్షాలతో గ్రామంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని భక్తులు అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.రావాడ పంచాయతీకి చెందిన మండల జనసేన పార్టీ సీనియర్ నాయకుడు మొటూరు హరిబాబు ఆప్త మిత్రుడు ఊటగడ్డ జంక్షన్లో గల శ్యామలాంబ స్వీట్స్ షాప్ ప్రొప్రైటర్ పచ్చికోరు చంద్రరావు ఆర్థిక సహకారంతో ఆలయ ప్రాంగణంలో భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో స్థానిక నాయకులు ఊడి రాము,పి బాబురావు,పి అప్పలరాజు, స్థానిక పెద్దలు,పెద్దలు, యువకులు,భక్తులు పాల్గొన్నారు.



## అక్షరాస్యతతోనే సమాజ అభివృద్ధి

- కంటం శిరీష కృష్ణారెడ్డి
- అలియబాద్ లో అక్షరమాల కార్యక్రమంపై అవగాహన శిక్షణ..

**జయభేరి, మేడ్చల్ :**



సమాజ అభివృద్ధికి విద్యే ప్రధాన పునాది అని అలియబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కంటం శిరీష కృష్ణారెడ్డి అన్నారు. గురువారం అక్షరాస్యతను పెంపొందించడంతో పాటు ప్రజలను విద్యా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడమే లక్ష్యంగా చేపట్టిన 'ఉల్లాస అమ్మకు అక్షరమాల' కార్యక్రమంపై అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

TOSS(టోస్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధికారులు, రిసోర్స్ పర్సన్లు (RPలు), అంగన్‌వాడీ టీచర్లకు కార్యక్రమం అమలు విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ కంటం శిరీష కృష్ణారెడ్డి హాజరైన ఆమె మాట్లాడుతూ అక్షరాస్యత ప్రతి ఒక్కరి హక్కు అని, సమాజ అభివృద్ధికి విద్యే ప్రధాన పునాది అని మున్సిపల్ చైర్‌పర్సన్ కంటం శిరీష కృష్ణారెడ్డి అన్నారు. విద్యకు దూరంగా ఉన్న వారు, ముఖ్యంగా మహిళలు, అక్షరజ్ఞానం పొందేలా 'ఉల్లాస అమ్మకు అక్షరమాల' కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యా అవకాశాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరువ చేయడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. అక్షరజ్ఞానం కల్పించడం ద్వారా వ్యక్తుల్లో ఆత్మవిశ్వాసం పెరగడంతో పాటు కుటుంబం, సమాజ అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో RPలు, అంగన్‌వాడీ టీచర్లు, సంబంధిత సిబ్బంది సమన్వయంతో పనిచేసి అక్షరాస్యతకు దూరంగా ఉన్న వారిని గుర్తించాలని సూచించారు. కార్యక్రమం అమలు తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ఎదురయ్యే సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. ప్రతి అర్హుడికి విద్యా అవకాశాలు అందేలా కృషి చేసి అలియాబాద్ మున్సిపాలిటీని అక్షరాస్యతలో ముందంజలో నిలపాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పిడి డిఆర్డీఏ (PD DRDA) సంభశివరావు, డిడి (DD) అడల్ట్ ఎడ్యుకేషన్ అనిత, మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకట్‌రెడ్డి, టోస్ (TOSS) కోఆర్డినేటర్ సత్యనారాయణ, టిఎల్ఎఫ్ (TLF) అధ్యక్షురాలు లావణ్య, ఎడిఎంసి (ADMC) ఉమేష్, సిసి (CC) నాగశ్రీతో పాటు ఆర్.పి (RP)లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## పాఠశాలకు వచ్చే ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలి

**జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 20:**



పాఠశాలకు వస్తున్న విద్యార్థులకు తగిన శ్రద్ధతో బోధన చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి అన్నారు. గురువారం తుర్కపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనస్ఫూర్తిగా బోధించినట్లయితే పాఠశాలలో క్రమంగా విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దడం ప్రతి ఉపాధ్యాయుడిపై ఉన్న గురుతర బాధ్యత అని తెలిపారు. విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించి, వారికి అర్థమయ్యే విధంగా నాణ్యమైన బోధన అందించాలని సూచించారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసినప్పుడే విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెరుగుతుందని అన్నారు. సమావేశంలో నేర్చుకున్న ప్రతి విషయాన్ని పాఠశాలలో అమలు చేయాలని సూచించారు. గ్రామంలో ఉన్న సర్పంచ్, గ్రామ కార్యదర్శి, విద్యావేత్తలతో మమేకమై విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు చొరవ చూపాలని అన్నారు. పాఠశాల అభివృద్ధిలో ఉపాధ్యాయులతో పాటు గ్రామస్థులు కూడా భాగస్వాములు కావాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు అన్ని అంశాల్లో జిల్లాను మొదటి స్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఈఓ బిక్షపతి కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మంజుషారాణి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, బాలమణి, స్వరూపారాణి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మండల రిసోర్స్ పర్సన్, సీఆర్పీలు పాల్గొన్నారు.

# రెస్కో ఉద్యోగుల కన్నీటిగాథపై అసెంబ్లీలో ఎమ్మెల్యే గళం

జయభేరి, అనకాపల్లి:



అనకాపల్లి గ్రామీణ విద్యుత్ సహకార సంస్థ (రెస్కో) కన్సాలిడేటెడ్ పై ఉద్యోగులు ఎదుర్కొంటున్న వేతన లోపాలు,భద్రతా రహిత పరిస్థితులపై శాసనసభ వేదికగా గురువారం అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ గళమెత్తారు. 1974లో స్థాపితమైన రెస్కో సంస్థ గ్రామీణ ప్రాంతాలకు సుదీర్ఘకాలం సేవలందించినప్పటికీ, ప్రభుత్వం నవీకరణ లైసెన్స్ ఇవ్వకపోవడంతో ఏపీఈపీడీసీఎల్‌లో విలీనం కాక తప్పలేదు.అయితే ఈ విలీన ప్రక్రియలో చోటుచేసుకున్న పాలనాపరమైన అవకతవకలను సరిచేయకపోవడంతో, రెండు మూడు దశాబ్దాలుగా ప్రాణాలు పణంగా పెట్టి పనిచేస్తున్న ఉద్యోగుల జీవితాలు తీవ్ర అంధకారంలోకి నెట్టబడ్డాయి.దశాబ్దాల సర్వీసు ఉన్నప్పటికీ ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్ అమలవ్వకపోవడం,సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోర్టు స్పష్టమైన ఆదేశాలిచ్చినా యాజమాన్యం అమలు చేయకపోవడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. నిబంధనల ప్రకారం వర్తించాల్సిన 12 శాతం పీఎఫ్ స్థానంలో కేవలం రూ. 10,000 వేతన పరిమితికే కుదించడం సిబ్బంది భవిష్యత్తును దెబ్బతీస్తోందని సభలో ప్రస్తావించారు.వీటికితోడు ముందస్తు సమాచారం లేకుండా సుమారు 200 మంది జీతాల్లో అధికారులు కోతలు విధించడం, ఉద్యోగుల ఆందోళనలతో కేవలం కొందరికి మాత్రమే తిరిగి జమ చేయడం యంత్రాంగం వైఫల్యానికి అద్దం పడుతోందని అన్నారు. అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ఠగా జులై 31 నాటికి హెల్త్ ఇన్సూరెన్స్,ఫిబ్రవరి నాటికి యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ గడువు ముగిసినా ప్రీమియం రెన్యూవల్ చేయలేదు.ఈ అనాలోచిత వైఖరి కారణంగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన రెస్కో సీపీడబ్ల్యూ ఉద్యోగి తోకాడ దుర్గారావు కుటుంబానికి ఆపద్బాంధవుడిగా నిలవాల్సిన బీమా పరిహారం ఒక్క రూపాయి కూడా దక్కక పోవడం విచారకరమన్నారు. వీటన్నింటికీ బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని,మృతుని కుటుంబానికి వర్తించాల్సిన బీమా మొత్తాన్ని ఆ అధికారుల నుంచే రికవరీ చేసి చెల్లించాలని ఎమ్మెల్యే గట్టిగా డిమాండ్ చేశారు. శాసనసభలో తమ సుదీర్ఘకాల సమస్యలను ప్రాధాన్యతతో ప్రస్తావించినందుకుగాను రెస్కో సీపీడబ్ల్యూ ఉద్యోగుల యూనియన్ నాయకులు,సిబ్బంది ఎమ్మెల్యే కొణతాలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.ఆయన చొరవతో ప్రభుత్వం తక్షణమే స్పందించి మినిమం టైమ్ స్కేల్ అమలుతో పాటు ,ఆరోగ్య, ప్రమాద బీమా సౌకర్యాలను పునరుద్ధరించి తమకు శాశ్వత న్యాయం చేస్తుందని ఉద్యోగులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



## పరవాడ ప్రభుత్వ కళాశాలలో అభయ అవగాహన కార్యక్రమం

జయభేరి, పరవాడ:

పరవాడ ప్రభుత్వ కళాశాలలో పరవాడ పోలీస్ స్టేషన్ ఎస్ఐ జి .స్ .వి. మహాలక్ష్మి ఆధ్వర్యంలో అభయపై జరిగిన కార్యక్రమంలో మహిళలు, విద్యార్థినుల భద్రత, మహిళా హక్కులు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, సోషల్ మీడియాను జాగ్రత్తగా వినియోగించడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.అత్యవసర పరిస్థితుల్లో 112, 100, 1098 వంటి హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించుకోవాలని సూచించారు. అలాగే సమస్యలు ఎదురైనప్పుడు భయపడకుండా పోలీసులను ఆశ్రయించాలని విద్యార్థినులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సుమారు 40 మంది విద్యార్థులు, విద్యార్థినులు మరియు కళాశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మాకం చంద్రమౌళి కుటుంబాన్ని పరామర్శ



జయభేరి, దేవరకొండ :

లయన్ క్లబ్ ఆఫ్ దేవరకొండ ఆధ్వర్యంలో లయన్ సభ్యులు మాకం చంద్రమౌళి (CM) కుటుంబాన్ని పరామర్శించి, అనారోగ్యంతో చికిత్స పొందిన వారి కుమార్తె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా లయన్ M.J.F. గాజుల రాజేష్ లయన్ MJF వసుకుల సత్యనారాయణ A.D.E., ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్ Lion Past president లయన్ D.C.వనం శ్రీనివాస్ ఇంటికి విచ్చేసి ఆప్యాయంగా పరామర్శించి, తమ విలువైన సమయాన్ని కేటాయించినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు. కష్ట సమయంలో పలకరించి, ధైర్యం చెప్పడం నిజమైన మానవత్వానికి నిదర్శనం. మీ అందరి ఆప్యాయత, అభిమానం మా కుటుంబానికి ఎంతో మనోధైర్యాన్ని అందించింది. మీ ఆప్యాయతను, సహకారాన్ని మా కుటుంబం ఎప్పటికీ మరువదు.

## విద్యార్థులపై పోలీసుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

- తెలంగాణ ఎస్సి జన సంఘం



జయభేరి, తొర్రూర్, ఆగస్టు 20 :

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో పాలిటెక్నిక్ విద్యార్థులపై పోలీసుల దాడి సరైందికాదని ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం అని తెలంగాణ ఎస్సి పోరాట వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు పంతం విజయెందర్, రాష్ట్ర కార్యదర్శి వెలిశాల శ్యామ్ అన్నారు.విద్యార్థులు తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చి వినతిపత్రం ఇవ్వాలనుకుంటే.. వారిపై పోలీసులు దాడి చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు.జిల్లా కలెక్టర్ వచ్చి సమస్యను పరిష్కరిస్తామని ఒక్క మాట చెప్పి ఉంటే బాగుండేదని అన్నారు. పోలీసులు ఇలా విద్యార్థులపై దాడి చేయ్యడం కరెక్ట్ కాదని మండిపడ్డారు.జిల్లా పరిపాలన వ్యవస్థ, పోలీస్ వ్యవస్థ తమ చేతుల్లో ఉందని సాధారణ ప్రజలపై విద్యార్థులపై ఇలా ప్రవర్తిస్తే సాహించేది లేదని అన్నారు. విద్యార్థులు వినతిపత్రం తీసుకుని వెళ్తే సమస్య పై విద్యార్థులపై జరిగిన దాడికి బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తెలంగాణ ఎస్సి జన సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

## 2026-27 విద్యా సంవత్సర విద్యార్థులకు ఎన్రోల్మెంట్ కార్యక్రమం



జయభేరి, దేవరకొండ :

మునగాల కొండలరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్), దేవరకొండలో ఎన్ సి సి విభాగం ఆధ్వర్యంలో 202627 విద్యా సంవత్సర విద్యార్థులకు ఎన్రోల్మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ~~రామావత్ రవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నల్గొండ 31 బెటాలి~~ యన్ పి ఐ స్టాఫ్ విద్యార్థులకు ఫిజికల్ టెస్ట్ మరియు మెడికల్ టెస్ట్ తో పాటు రిటర్న్ టెస్ట్ ఎగ్జామ్ నిర్వహించి మొత్తం ప్రథమ సంవత్సర క్యాడెట్స్ ని 22 మందిని ఎంపిక చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మరియు ఎన్సిసి సిటిఓ జి కోటయ్య,సుబేదార్ కొమ్ము మల్లయ్య, హవల్దార్ మల్కప్ప కట్టి, అకాడమిక్ కోఆర్డినేటర్ సి.లింగమయ్య, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ జి. లింగారెడ్డి, డా. కె.రేణుక, శివకృష్ణ, మధు, తదితర అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు ఎన్సిసి క్యాడెట్లు తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం

- గరిసెల సురేందర్ ముదిరాజ్

జయభేరి, మేడ్చల్, ఆగస్టు 20:




మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని గుండ్ల పోచంపల్లి డివిజన్ అధ్యక్షుడు గారిసెల సురేందర్ ముదిరాజ్ అన్నారు. గురువారం మాజీ ప్రధానమంత్రి, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను గుండ్ల పోచంపల్లి 299వ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సురేందర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గరిసెల సురేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ దేశ ప్రధానమంత్రిగా రాజీవ్ గాంధీ అందించిన సేవలు ఎనలేనివని కొనియాడారు. దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఆయన ముందు చూపుతో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ఆధునిక భారతదేశ నిర్మాణానికి రాజీవ్ గాంధీ చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. దేశం కోసం తన ప్రాణాలను సైతం అర్పించిన మహనీయుడు రాజీవ్ గాంధీ అని, ఆయన ఆశయాలను కొనసాగించడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని సురేందర్ ముదిరాజ్ అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గువ్వ రవి ముదిరాజ్, గుండ్ల పోచంపల్లి మాజీ సర్పంచ్ బేరి ఈశ్వర్, శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు గడిల కృష్ణారెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీరంగవరం నవీన్ ముదిరాజ్, INTUC జిల్లా నాయకుడు కావేరి శేఖర్ ముదిరాజ్, సేవాదళ్ అధ్యక్షుడు చిల్ల సాయి ముదిరాజ్, NSUI జిల్లా నాయకుడు గడిల రాఘవేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ డివిజన్ నాయకులు చిల్ల వెంకటేష్ ముదిరాజ్, కందాడి రవీందర్ రెడ్డి, చిన్ని కృష్ణ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల చేతిలో ఉపాధ్యాయురాలి హత్య అత్యంత బాధాకరం

- అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ABVP) కొండమల్లేపల్లి శాఖ ఆధ్వర్యంలో మీడియా సమావేశం

జయభేరి, కొండమల్లేపల్లి :



నాగార్జున గ్రామర్ హైస్కూల్ ప్రిన్సిపల్ రూపా రెడ్డి మేడం హత్య ఘటనను ఏబీవీపీ తీవ్రంగా ఖండిస్తుంది. పదవ తరగతి చదువుతున్న విద్యార్థులే ఈ ఘటనకు పాల్పడటం అత్యంత బాధాకరమైన విషయం. విద్యార్థుల చేతుల్లోనే ఒక ఉపాధ్యాయురాలు ప్రాణాలు కోల్పోవడం సమాజం మొత్తం ఆలోచించాల్సిన పరిస్థితిని తీసుకొచ్చింది. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కోకన్వీనర్ యలమల గోపీచంద్ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును కేవలం చదువు, మార్కుల పరంగానే కాకుండా వారి ప్రవర్తన, స్నేహాలు, అలవాట్లు, మానసిక స్థితిపై కూడా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. చిన్న వయసులోనే విద్యార్థులు చెడు వ్యసనాలు, మత్తు పదార్థాల వైపు ఆకర్షితులు కాకుండా ప్రభుత్వం, పోలీస్ శాఖ, తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. పాఠశాలలు, కళాశాలల సమీపంలో ఉన్న వైన్ షాపులు, బెల్ట్ షాపులు, అక్రమ మత్తు పదార్థాల విక్రయ కేంద్రాలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లో పోలీసుల నిఘాను పెంచి విద్యార్థులు చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ప్రవర్తనలో వచ్చే మార్పులను గమనిస్తూ, వారితో స్నేహపూర్వకంగా మాట్లాడి సరైన మార్గంలో నడిపించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నగర సంయుక్త కార్యదర్శి నూతన గంటి గణేష్, మేడమోని సంతోష్, కండెల బాలు, కుందూరు గోవింద్, షేక్ రహీం భాష, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# చీపురుపల్లి తూర్పు రెవిన్యూ సర్వే నంబర్లలో భూ రీసర్వే

జయభేరి, పరవాడ:



పరవాడ మండలంలోని చీపురుపల్లి తూర్పు రెవెన్యూ గ్రామ పరిధిలో గల మంగప్పయ్య గారి ఊరు, సమ్మంగిపాలెం ప్రాంతాలకు చెందిన రైతుల భూములకు గురువారం రీసర్వే నిర్వహించారు. చీపురుపల్లి తూర్పు రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 237, 238లో రీసర్వే ప్రక్రియ చేపట్టారు. రీసర్వే నిర్వహిస్తున్న సర్వేయర్లు బాలరాజు, కళ్యాణ్ రైతుల సమక్షంలో భూముల సరిహద్దులను పరిశీలించి, రైతులు చూపించిన హద్దులను నమోదు చేశారు. రీసర్వే ప్రక్రియను పారదర్శకంగా, రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించడంతో గ్రామస్తులు సర్వే బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏలు సమ్మంగి లోవరాజు, శివలంక రాజు, నాయుడుపాలెం మాజీ సర్పంచ్ కూండ్రపు సీతారామయ్యతో పాటు రైతులు సమ్మంగి సోమేశ్వరరావు, కణితి చిన సోమేశ్వరరావు, లాలం అప్పలనాయుడు, కూండ్రపు సన్యాసినాయుడు , సమ్మంగి లోవరాజు, సమ్మంగి చంద్రావు, సమ్మంగి అప్పారావు, సమ్మంగి సోములమ్మ , కణితి ఆదినారాయణ, సమ్మంగి బంగారి, సమ్మంగి గాంధీ ,సమ్మంగి హరీష్ , సమ్మంగి ముత్యాలు, కణితి పెద్ద సోమేష్, కణితి దేవుడు, కణితి రమణ, కణితి చిన్నారావు, లాలం తాతారావు, కూండ్రపు దేముడు, తదితరులు పాల్గొన్నారు.రీసర్వే ప్రక్రియలో సహకరించిన సర్వేయర్లు బాలరాజు, కళ్యాణ్‌కు రైతులు, గ్రామస్తులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

## హరిదాస్ జన్మదిన వేడుకలు

జయభేరి, దేవరకొండ :

బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం నాయకులు ముదిగొండ హరిదాస్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ హాజరై, ముదిగొండ హరిదాస్‌ను శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రమావత్ రవీంద్ర కుమార్ మాట్లాడుతూ.. హరిదాస్‌కు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, ప్రజా సేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

ఈ జన్మదిన వేడుకల్లో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యానాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల రాజు, బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ, కౌన్సిలర్లు పొట్ట మురళి, పొట్ట మధు, సర్పంచ్ అడారపు హరికృష్ణ, బొడ్డు మల్లేష్, జమీర్ బాబా, గుండాల వెంకట్, మైనంపల్లి ప్రవీణ్, బత్తుల ఆంజనేయులు,ప్రశాంత్, లడ్డు తదితరులు పాల్గొని ముదిగొండ హరిదాస్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



## విద్యార్థుల చేతిలో ఉపాధ్యాయురాలి హత్య అత్యంత బాధాకరం

జయభేరి, కొండమల్లేపల్లి :

నాగార్జున గ్రామర్ హైస్కూల్ ప్రిన్సిపల్ రూపా రెడ్డి మేడం హత్య ఘటనను బిఆర్ఎస్వీ తీవ్రంగా ఖండిస్తుందని బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ అన్నారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులే ఈ ఘటనకు పాల్పడటం అత్యంత బాధాకరమైన విషయమని ఆయన పేర్కొన్నారు.విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయురాలు విద్యార్థుల చేతుల్లోనే ప్రాణాలు కోల్పోవడం సమాజం మొత్తం ఆలోచించాల్సిన పరిస్థితిని తీసుకొచ్చిందన్నారు.విద్యార్థుల్లో ఇలాంటి హింసాత్మక ఆలోచనలు ఎందుకు పెరుగుతున్నాయనే అంశంపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, ప్రభుత్వాలు సమగ్రంగా ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల మానసిక స్థితి, వారి ప్రవర్తన, కుటుంబ మరియు పాఠశాల వాతావరణంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.ఈ ఘటనకు దారితీసిన కారణాలను పూర్తిస్థాయిలో వెలికితీసి, నిజానిజాలను సమగ్రంగా దర్యాప్తు చేయాలని బొడ్డుపల్లి కృష్ణ డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పాఠశాలల్లో కౌన్సెలింగ్, నైతిక విలువలు, మానసిక ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలని కోరారు. రూపా రెడ్డి మేడం కుటుంబ సభ్యులకు బిఆర్ఎస్వీ తరపున ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## ఎర్ర బిచ్య తండా తీజ్ వేడుక

- BRS యువ నేత నేనావత్ నాగార్జున నాయక్



జయభేరి, దేవరకొండ :

దేవరకొండ మండలం గిరిజానగర్ తండా గ్రామం లోని ఎర్ర బిచ్య తండా లో నేడు తీజ్ వేడుకల్లో పాల్గొన్న BRS యువ నేత నేనావత్ నాగార్జుననాయక్ కి ఘన స్వాగతం పలికిన ఎర్ర బిచ్య తండా నాయకులు ఈ సందర్భంగా శాలువతో సత్కరించారు. అనంతరం తండాలో తీజ్ వేడుకల్లో పాల్గొని తీజ్ శుభాకాంక్షలు తెలిపారు.

## భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి



జయభేరి, సైదాపూర్ :

కరీంనగర్ జిల్లా వేసైదాపూర్ పాత బస్టాండ్ లో భారత మాజీ ప్రధాని భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా వారి చిత్ర పటానికి పూలు వేసి మండల కాంగ్రెస్ అధ్యక్షులు చాడ కొండాల్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షులు చాడ కొండాల్ రెడ్డి మాట్లాడుతూ.. రాజీవ్ గాంధీ ప్రధాని గా ఎన్నో సంస్కరణలు చేపట్టారని, ఐటీ రంగానికి దేశంలో పునాది వేసిన గొప్ప నాయకుడని, దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని కేవలం 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించి, దేశ ప్రజాస్వామ్య నిర్మాణంలో యువతకు కీలకమైన పాత్ర కల్పించిన గొప్ప నాయకుడు రాజీవ్ గాంధీని, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే వారికి మనం అందించే నిజమైన నివాళని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దొంత సుధాకర్ , జిల్లా సీనియర్ నాయకులు గుండారపు శ్రీనివాస్, మిట్టపల్లి కిష్టయ్య, మండలంలోని కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు, సర్పంచులు, మార్కెట్ కమిటీ మరియు సొసైటీ డైరెక్టర్లు, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు, యూత్ నాయకులు, NSUI, ఎస్సీ సెల్, ఎస్టీ సెల్, బీసీ సెల్, మైనారిటీ సెల్, కిసాన్ సెల్ అధ్యక్షులు, సోషల్ మీడియా విభాగాల నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# అప్పుడప్పుడు ఓ సిగరెట్ తాగితే ఏమవుతుందిలే అనుకుంటున్నారా..?

సిగరెట్ అంటే ఏళ్ల తరబడి తాగితేనే ప్రమాదం వస్తుందని చాలామంది భావిస్తుంటారు. ఇప్పుడే మొదలుపెట్టాను.. ఇంకా పెద్దగా ఏమీ కాలేదు, రోజుకు ఒకటో రెండో మాత్రమే.. దాంతో ఏమవుతుందిలే.. అంటూ తమను తాము సమర్థించుకునే వారూ ఉంటారు. మరికొందరు పార్టీల్లో లేదా స్నేహితులతో కలిసినప్పుడు మాత్రమే సిగరెట్ తాగుతామని, తమకు ఎలాంటి ఇబ్బంది ఉండదని అనుకుంటారు. కానీ సిగరెట్ పొగ శరీరంలోకి వెళ్లిన తర్వాత ఎలాంటి మార్పులు మొదలవుతాయి.. హాని కనిపించడానికి నిజంగానే సంవత్సరాలు పడుతుందా.. ఈ విషయంపై జనరల్ ఫిజీషియన్ డాక్టర్ కీలక విషయాలను వెల్లడించారు.

డాక్టర్ తెలిపిన వివరాల ప్రకారం..సిగరెట్ వల్ల కలిగే నష్టం బయటకు కనిపించే లక్షణాలు వచ్చినప్పుడే మొదలవుతుందని అనుకోవడం పొరపాటే. పొగను పీల్చిన వెంటనే శరీరం దానికి స్పందించడం ప్రారంభిస్తుంది. ముఖ్యంగా గుండె, రక్తనాళాలు, ఊపిరితిత్తులపై దాని ప్రభావం మొదలవుతుందని తెలిపారు. ప్రారంభంలో ఈ మార్పులు చాలా స్వల్పంగా ఉండొచ్చని, అందువల్ల వ్యక్తికి తాను ఆరోగ్యంగానే ఉన్నట్లు అనిపించవచ్చని చెప్పారు. ఇదే కారణంగా ఎలాంటి సమస్య లేదనే భావనతో చాలామంది ధూమపానాన్ని కొనసాగిస్తుంటారని వివరించారు. కానీ కాలం గడిచేకొద్దీ ఈ ప్రభావం క్రమంగా పెరిగి తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చని హెచ్చరించారు. కొద్దిపాటి ధూమపానం చేసినా శరీరంలో కొన్ని తక్షణ మార్పులు చోటుచేసుకోవచ్చని తెలిపారు. సిగరెట్‌లోని నికోటిన్ కారణంగా గుండె కొట్టుకునే వేగం, రక్తపోటు పెరగవచ్చని చెప్పారు. అదే సమయంలో పొగ ఊపిరితిత్తుల్లోకి చేరడం వల్ల అక్కడ చికాకు, వాపు వంటి మార్పులు కూడా మొదలయ్యే అవకాశం ఉందన్నారు. నిరంతరంగా ధూమపానం చేయడం వల్ల ఈ ప్రభావాలు పదేపదే చోటుచేసుకుని క్రమంగా ఊపిరితిత్తులు, గుండె, రక్తనాళాలపై భారాన్ని పెంచుతాయని వివరించారు. అందుకే దగ్గు, ఆయాసం, ఛాతీలో అసౌకర్యం వంటి లక్షణాలు కనిపించకపోయినా.. ధూమపానం వల్ల శరీరానికి ఎలాంటి ప్రభావం లేదని భావించకూడదని చెబుతున్నారు.

రోజుకు ఒక్క సిగరెట్ మాత్రమే.. అప్పుడప్పుడు మాత్రమే తాగుతాను అనే వారు కూడా పూర్తిగా సురక్షితమైనది కాదని డాక్టర్ స్పష్టం చేశారు. ధూమపానానికి హాని లేని మోతాదు అంటూ ఏదీ లేదని తెలిపారు.సిగరెట్ల సంఖ్య పెరిగే కొద్దీ ప్రమాదం పెరుగుతుందనేది నిజమే అయినప్పటికీ.. తక్కువగా తాగడం వల్ల ప్రమాదం పూర్తిగా తొలగిపోదన్నారు. నిరంతర దగ్గు, మెట్లు ఎక్కేటప్పుడు సాధారణం కంటే ఎక్కువగా ఆయాసం రావడం, త్వరగా అలసిపోవడం, తరచుగా ఛాతీ ఇన్ఫెక్షన్లు రావడం, గొంతులో చికాకు వంటి మార్పులను నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. ముఖ్యంగా ఛాతీ నొప్పి లేదా విశ్రాంతి సమయంలోనే శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. అయితే ధూమపానం చేసే వారికి ఒక మంచి విషయం కూడా ఉందని తెలిపారు. సిగరెట్ మానేసిన తర్వాత శరీరం కోలుకునే ప్రక్రియను ప్రారంభిస్తుందని చెప్పారు. కాలక్రమేణా గుండె, రక్తనాళాలు, ఊపిరితిత్తులపై ధూమపానం వల్ల ఏర్పడే ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంటుందని వివరించారు. ఎంత త్వరగా మానేస్తే అంత ఎక్కువ ప్రయోజనం ఉంటుందని, అయితే చిన్న వయసులో మానలేకపోయినా ఏ వయసులో మానేసినా ఆరోగ్యానికి మేలు జరుగుతుందని స్పష్టం చేశారు. కాబట్టి ఇప్పుడైతే ఏమీ కాలేదు అనే ఆలోచనతో ధూమపానాన్ని కొనసాగించడం కంటే.. వీలైనంత త్వరగా ఆ అలవాటుకు దూరంగా ఉండటమే భవిష్యత్ ఆరోగ్యానికి మంచిదని సూచించారు.

(గమనిక: ఈ కథనం వైద్యులు అందించిన సాధారణ సమాచారం ఆధారంగా రాసినది. దీనిని ధృవీకరించడం లేదు.)



# కొబ్బరిబొండంలా ఉన్న పొట్ట ఇట్టే కరిగిపోవాల్సిందే.!

**శరీర బరువును అదుపులో ఉంచుకోవడానికి చాలా మంది రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. దైనందిన జీవితంలో కొన్ని సాధారణ అలవాట్లను మార్చుకోవడం ద్వారా సులభంగా బరువు తగ్గవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.**

డైలీ రొటీన్‌లో కొన్ని ప్రత్యేకమైన చిట్కాలను పాటిస్తే మంచి ఫలితాలు పొందవచ్చు. ఉదయం సమయంలో తీసుకునే ఆహారం నుంచి రాత్రి పడుకునే వరకు కొన్ని నియమాలను పాటించడం చాలా అవసరం. ఉదయం పూట తీసుకునే అల్పాహారంలో గుడ్లు, చియా గింజలు, అవిసె గింజలు, పీనట్ లేదా ఆల్మండ్ బట్టర్, బాదం అలాగే వాల్‌నట్స్ వంటివి ఉండేలా చూసుకోవాలి.

వీటిలో మంచి కొవ్వులు ఎక్కువగా ఉండటం వల్ల శరీరానికి తగిన శక్తి లభిస్తుంది. దీనివల్ల రక్తంలోని షుగర్ లెవెల్స్ అన్నీ అదుపులో ఉంటాయి. అలాగే రోజువారీ జీవితంలో నడకను ఒక అలవాటుగా మార్చుకోవడం ఎంతో ముఖ్యం. రోజూ పది వేల నుంచి పన్నెండు వేల స్టెప్స్ నడిస్తే శరీరంలోని అదనపు క్యాలరీలు వేగంగా బర్న్ అవుతాయి.

ఆహారంలో ఫైబర్ శాతం ఎక్కువగా ఉండేలా చూసుకోవడం బరువు తగ్గడంలో కీలక పాత్ర పోషిస్తుంది. పీచు పదార్థం జీర్ణవ్యవస్థను మెరుగుపరచడమే కాకుండా త్వరగా ఆకలి వేయకుండా నియంత్రిస్తుంది. దీనితో పాటు రాత్రి సమయంలో భోజనం చేసే వేళలపై కూడా శ్రద్ధ పెట్టాలి.

సాధారణంగా రాత్రి నిద్రపోయేదానికంటే కనీసం నాలుగు గంటల ముందే డిన్నర్ పూర్తి చేయడం ఆరోగ్యానికి చాలా మంచిది. ఈ చిన్నపాటి జీవనశైలి మార్పులు బరువు తగ్గాలనుకునే వారికి ఎంతగానో సహాయపడతాయి.



# హెల్త్‌కి మంచిదని పరగడుపున తులసి ఆకులు తింటున్నారా..

## వామ్మో.. వాళ్లు తింటే తిరిగి హాస్పిటల్‌కు వెళ్లాల్సిందే

భారతీయ సంస్కృతిలో తులసి మొక్కకు ప్రత్యేక స్థానం ఉంది. పూజలు, ఆధ్యాత్మిక ఆచారాలతో పాటు శతాబ్దాలుగా సంప్రదాయ ఆయుర్వేద వైద్యంలోనూ తులసిని ఉపయోగిస్తున్నారు. ముఖ్యంగా ఉదయాన్నే పరగడుపున కొన్ని తులసి ఆకులు నమిలి తింటే ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని చాలామంది నమ్ముతుంటారు. అయితే తులసి నిజంగానే అన్ని రకాల అనారోగ్యాలను దూరం చేస్తుందా? రోజూ నాలుగు ఆకులు తింటే సరిపోతుందా? అనే సందేహాలు చాలామందిలో ఉన్నాయి. తులసి ఆకుల్లో విటమిన్లు, ఖనిజాలతో పాటు యూజినాల్ వంటి వృక్ష రసాయన సమ్మేళనాలు, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి శరీరంలో ఏర్పడే ఫ్రీ రాడికల్స్‌తో పోరాడటంలో, ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయి. అందుకే తులసిని ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లలో భాగంగా తీసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. జీర్ణక్రియకు తులసి ఉపయోగకరమా? సంప్రదాయ వైద్యంలో తులసి ఆకులను అజీర్తి, కడుపు ఉబ్బరం వంటి స్వల్ప జీర్ణ సమస్యల నుంచి ఉపశమనం కోసం ఉపయోగిస్తారు. అయితే తీవ్రమైన మలబద్ధకం లేదా గ్యాస్ట్రిక్ సమస్యలను తులసి మాత్రమే పూర్తిగా నయం చేస్తుందని చెప్పడానికి తగిన శాస్త్రీయ ఆధారాలు లేవు. కాబట్టి తీవ్రమైన సమస్యలు ఉంటే వైద్యులను సంప్రదించడం అవసరం. తులసిలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ మైక్రోబియల్ లక్షణాలు ఉన్నాయని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇవి గొంతు నొప్పి, సాధారణ జలుబు వంటి స్వల్ప సమస్యల్లో కొంత ఉపశమనం కలిగించవచ్చు. అయితే ఆస్తమా లేదా తీవ్రమైన శ్వాసకోశ ఇన్ఫెక్షన్లకు వైద్య చికిత్సకు బదులుగా తులసిని ఉపయోగించకూడదు. ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడుతుందా? తులసిని సహజసిద్ధమైన అడాప్టోజెన్‌గా పరిగణిస్తారు. కొన్ని అధ్యయనాల ప్రకారం తులసి మానసిక ఒత్తిడి, ఆందోళన లక్షణాలను తగ్గించడంలో సహాయపడే అవకాశం ఉంది. అలాగే శరీర సహజ రోగనిరోధక వ్యవస్థకు తులసిలోని పోషకాలు తోడ్పడవచ్చని భావిస్తున్నారు. రోజూ 4 ఆకులు తప్పనిసరిగా తినాలా? ఆరోగ్యంగా ఉన్న వ్యక్తులు రోజుకు 34 తాజా తులసి ఆకులను తీసుకోవడం వల్ల ప్రయోజనం ఉండవచ్చని ఈ నివేదిక పేర్కొంటోంది. అయితే ప్రతిఒక్కరూ తప్పనిసరిగా రోజూ నాలుగు ఆకులే తినాలనే వైద్యపరమైన నియమం లేదు. తులసిని మోతాదుకు మించి ఔషధంలా తీసుకోవడం కూడా సరైన పద్ధతి కాదు. గర్భిణులు, పాలిచ్చే తల్లులు తులసిని ఔషధ మోతాదులో తీసుకునే ముందు వైద్యుల సలహా తీసుకోవాలి. దీర్ఘకాలిక అనారోగ్యాలతో బాధపడుతున్నవారు లేదా క్రమం తప్పకుండా మందులు వాడేవారు కూడా అధికంగా తులసిని తీసుకోకూడదు. ముఖ్యంగా తులసి ప్రధాన వైద్య చికిత్సకు ప్రత్యామ్నాయం కాదని గుర్తుంచుకోవాలి. ఆరోగ్యకరమైన ఆహారం, సమతుల్య జీవనశైలి, అవసరమైనప్పుడు సరైన వైద్య చికిత్సతో పాటు తులసిని ఉపయోగించడం మంచిది.





# ఇదెక్కడి సిరీస్ రా మామ.. మెంటలెక్కింది..!!

ఓటీటీలు వారం వారం రకరకాల సినిమాలు విడుదలై ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. కొత్త కొత్త సినిమాలు, వెబ్ సిరీస్, టాక్ షోలు స్ట్రీమింగ్ అలరిస్తున్న సంగతి తెలిసిందే. కొత్త సినిమాలు థియేటర్లలో విడుదలైన రెండు మూడు వారాలకే ఇప్పుడు ఓటీటీలోకి వస్తున్నాయి. ఇక ఓటీటీలో సినిమాలు చూడటానికే ఆడియన్స్ ఎక్కువగా ఇష్టపడుతున్నారు. రొమాంటిక్, హారర్, థ్రిల్లర్ తరహా సినిమాలు చూడటానికి ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ఈ క్రమంలోనే ఇప్పుడు ఓ రొమాంటిక్ సిరీస్ ఓటీటీని షేక్ చేస్తున్నాయి. ఆ సినిమా ఏంటంటే.. ఓటీటీలో దూసుకుపోతున్న ఆ రొమాంటిక్ సిరీస్ ఎదో కాదు పాంచాలి. ఇదొక రొమాంటిక్ డ్రామా. ఈ చిత్రాన్ని ఫ్యామిలీతో కలిసి అసలు చూడలేరు. ఐదుగురు భర్తలు ఉన్న స్త్రీ చుట్టూ ఈ సినిమా తిరుగుతుంది. ఐదుగురు అన్నాదమ్ములు.. అందరూ ఒకే స్త్రీని వివాహం చేసుకుంటారు. మహాభారతంలోని ద్రౌపతి పాత్ర ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించారు. 2019లో వచ్చిన ఈ తమిళ సిరీస్ లో టాలీవుడ్ హీరోయిన్ అనుప్రియ గోయెంకా ప్రధాన పాత్రలో నటించింది. ఇందులో ఆమె నటిగా ప్రశంసలు అందుకుంది. ఒకొక్క ఎపిసోడ్ సుమారు గంట 40 నిమిషాలు మాత్రమే రన్ టైమ్ ఉన్న ఈ పాంచాలి సిరీస్ ఇప్పుడు అల్ట్రా ప్లే ఓటీటీ యాప్ లో స్ట్రీమింగ్ అవుతుంది. అలాగే ప్రైమ్ వీడియోలోనూ అందుబాటులో ఉంది. ఐఎమ్‌డీబిలో కూడా 8.7 రేటింగ్ సొంతం చేసుకుంది ఈ సిరీస్. తమిళంతోపాటు తెలుగులోనూ ఈ సినిమా అందుబాటులో ఉంది. కథ విషయానికి వస్తే.. నలుగురు అన్నదమ్ములు ఒకే స్త్రీని (భూమి) వివాహం చేసుకుంటారు. సిటిలో ఉండే తమ తమ్ముడిని సైతం తమ భార్యనే వివాహం చేసుకోవాలని కండిషన్ పెడతారు. అందుకు అతడు అంగీకరించడు. అయితే ఒకరోజు తమ ఇంట్లో పూజ గదిలోని దేవుడి విగ్రహం నుంచి రక్తం రావడాన్ని గమనిస్తారు. దీంతో తమ తమ్ముడు భూమిని పెళ్లి చేసుకోకపోవడంతోనే ఇలా జరుగుతుందని అంటారు. చివరకు ఏం జరిగింది.. ? తన మరిదిని భూమి ఐదో భర్తగా పెళ్లి చేసుకుందా ? అనేది సినిమా.. ఈ సినిమాను ఒంటరిగా చూడటమే బెటర్. ఈ సిరీస్ లో ప్రతి ఎపిసోడ్ చాలా ఆసక్తికరంగా ఉంటుంది.



# చెన్నై లవ్ స్టోరీ ఓటీటీలోకి వచ్చేసింది..

టాలీవుడ్ యువ హీరో కిరణ్ అబ్బవరం హీరోగా, శ్రీ గౌరీ ప్రియ హీరోయిన్‌గా తెరకెక్కిన తాజా ప్రేమకథా చిత్రం 'చెన్నై లవ్ స్టోరీ' థియేటర్లలో భారీ విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. దర్శకుడు రవి నంబురి తెరకెక్కించిన ఈ చిత్రానికి ప్రముఖ దర్శకుడు, రచయిత సాయి రాజేష్ కథ అందించారు. విభిన్నమైన ప్రేమకథ, ఎమోషనల్ కంటెంట్‌తో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ సినిమా కిరణ్ అబ్బవరం కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. ఇక థియేటర్లలో మంచి విజయాన్ని నమోదు చేసిన ఈ చిత్రం ఇప్పుడు డిజిటల్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. 'చెన్నై లవ్ స్టోరీ' ఓటీటీ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ సోనీ లివ్ సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఎట్టకేలకు నేటి నుంచి ఈ సినిమా సోనీ లివ్‌లో స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి వచ్చింది. ప్రత్యేకంగా తెలుగు ప్రేక్షకులతో పాటు ఇతర ప్రాంతాల ప్రేక్షకులను కూడా ఆకట్టుకునేలా ఈ చిత్రాన్ని పాన్ ఇండియా భాషల్లో అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో థియేటర్లలో ఈ సినిమాను చూడలేకపోయిన వారు ఇప్పుడు ఇంట్లోనే ఓటీటీ ద్వారా ఈ ప్రేమకథను ఆస్వాదించే అవకాశం దక్కింది. కిరణ్ అబ్బవరం కెరీర్‌లో ఈ సినిమా ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకుంది. ఆయన నటనతో పాటు శ్రీ గౌరీ ప్రియతో కెమిస్ట్రీ కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంది. ముఖ్యంగా ప్రేమ, భావోద్వేగాలు, సంబంధాల చుట్టూ సాగే ఈ కథ యువ ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అయిందని చెప్పవచ్చు. థియేట్రికల్ రన్‌లో మంచి స్పందన రావడంతో సినిమా వసూళ్ల పరంగా కూడా అదిరిపోయే ఫలితాన్ని సాధించింది. ఈ చిత్రానికి సంగీత దిగ్గజం మణిశర్మ సంగీతం అందించడం మరో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ప్రేమకథకు తగ్గట్టుగా ఆయన అందించిన సంగీతం, నేపథ్య సంగీతం సినిమాకు మరింత బలం చేకూర్చాయి. భావోద్వేగ సన్నివేశాల్లో మణిశర్మ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రేక్షకులను ఆకట్టుకుంది.సాయి రాజేష్, ఎస్‌కేఎన్ నిర్మాణం వహించిన 'చెన్నై లవ్ స్టోరీ', థియేటర్లలో ఘన విజయాన్ని అందుకున్న తర్వాత ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకుల ముందుకు రావడంతో మరోసారి చర్చనీయాంశంగా మారింది. థియేటర్లలో మిస్ అయిన ప్రేక్షకులు, మంచి ప్రేమకథను చూడాలనుకునేవారు ఇప్పుడు సోనీ లివ్‌లో ఈ చిత్రాన్ని వీక్షించవచ్చు.

# సెప్టెంబర్‌లో యాక్షన్?



మోకాలి శస్త్రకిచికిత్స కారణంగా ప్రస్తుతం విశ్రాంతి మోడ్‌లో ఉన్నారు అగ్ర కథానాయకుడు నందమూరి బాలకృష్ణ. ఈ కారణంగా ఆయన నటిస్తున్న 'ఎన్‌బీకే 111' షూటింగ్ వాయిదా పడింది. డిసెంబర్‌లో సినిమాను విడుదల చేయాలనే సంకల్పంతో చిత్రబృందం ఉండగా, అనుకోకుండా జరిగిన ప్రమాదం వల్ల ఈ సినిమా షూటింగ్‌కి బ్రేకులు పడ్డాయి. ప్రస్తుతం బాలకృష్ణ కోలుకునే పనిలో ఉన్నారు. నిర్మాతకు ఎలాంటి నష్టం రాకూడదనే ఉద్దేశంతో ఆయన రికవరీపై ఫోకస్ పెట్టినట్టు తెలుస్తున్నది. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం సెప్టెంబర్‌లోనే ఈ సినిమా షూటింగ్ ఏర్పాట్లను కూడా చేసుకోమని దర్శకుడు మలినేని గోపీచంద్‌కి బాలకృష్ణ చెప్పినట్టు తెలిసింది. సెప్టెంబర్‌లో మెయిన్ సీన్స్ పూర్తిచేసి, అక్టోబర్‌లో ప్యాచ్ వర్క్ కంప్లీట్ చేసి, నవంబర్ మొత్తం పోస్ట్ ప్రొడక్షన్ పనులకు కేటాయించేలా చిత్రబృందం ప్లాన్ చేసిందట. అన్నీ అనుకున్నట్టు జరిగితే డిసెంబర్‌లోనే సినిమా విడుదలయ్యే అవకాశం ఉన్నది. కాజల్ అగర్వాల్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకటసతీశ్ కిలారు నిర్మిస్తున్న విషయం తెలిసిందే.

# అమీర్ లోగ్' లాంటి చిత్రం ఇప్పటి వరకు రాలేదు దర్శకుడు రమణా రెడ్డి సోమ



అవ్వల్ నంబర్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై మాధవి రెడ్డి సోమ నిర్మించిన తొలి చిత్రం 'అమీర్ లోగ్'. ఈ మూవీకి రమణా రెడ్డి సోమ దర్శకత్వం వహించారు. ఈ సినిమాకి మనోహర్ రెడ్డి మంచురి సహ నిర్మాతగా వ్యవహరించారు. ఈ చిత్రంలో MC హరి, మనోజ్, శశిధర్ ప్రధాన పాత్రల్లో నటించగా.. వేధా జలంధర్, రావణ్ నిట్టూరు, విశ్వేందర్ రెడ్డి, సాయోగి కీలక పాత్రలు పోషించారు. రానా దగ్గుబాటి సంస్థ 'స్పిరిట్ మీడియా' ఈ మూవీని తెలుగులో ఆగస్ట్ 21న గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోంది. ఈ క్రమంలో బుధవారం ప్రెస్ మీట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో.. దర్శకుడు రమణా రెడ్డి సోమ మాట్లాడుతూ.. ''అమీర్ లోగ్' సినిమాని ఇప్పటికి చాలా సార్లు చూశాం. కచ్చితంగా హిట్టు బొమ్మ. ఇప్పటి వరకు ఇలాంటి చిత్రం రాలేదు. అలాంటి ఓ గొప్ప అటెంప్ట్ నేను చేశాను. ప్రీమియర్లకు వచ్చిన రెస్పాన్స్ చూస్తే మేం హిట్ కొట్టేశాం, మేం అనుకున్నది సాధించేశాం అని అర్థమైంది. మలయాళంలో తీసినట్టుగా మన దగ్గర రావడం లేదు అని అంటుంటారు కదా.. ఇకపై హైదరబాద్ ఎరా స్టార్ట్ అయింది. ఆగస్ట్ 21న నైజాంలో స్టార్ట్ అయ్యే సౌండ్.. అన్ని వుడ్‌లకు చేరుకుంటుంది' అని అన్నారు. నటుడు MC హరి మాట్లాడుతూ.. ''అమీర్ లోగ్' సినిమా నాకు మంచి అవకాశాన్ని, కుటుంబాన్ని, అనుభవాన్ని ఇచ్చింది. రోహిత్ అన్న ఎడిటింగ్ అదిరిపోతుంది. స్మరణ్ అన్న అద్భుతంగా మ్యూజిక్ ఇచ్చారు.

మనోజ్, శశి, నేను కలిసి సెట్‌లో ఎంతో సరదాగా ఉండేవాళ్లం. సెట్‌లో రోజూ ఏదో ఒకటి కొత్తగా నేర్చుకునేవాళ్లం. ఈ జర్నీలో సపోర్ట్ చేసిన సందీప్ అన్న, ఎస్వీకే అన్నకి, మాధవి గారికి, రమణ అన్నకి థాంక్స్. ప్రీమియర్లు వేసిన ప్రతీ చోటా థియేటర్లు బ్లాస్ట్ అయ్యాయి. ఆగస్ట్ 21న కూడా మాకు అదే రెస్పాన్స్ వస్తుందని ఆశిస్తున్నాం' అని అన్నారు. నటుడు మనోజ్ మాట్లాడుతూ.. ''అమీర్ లోగ్' లాంటి సినిమా కెరీర్ ఆరంభంలోనే రావడం ఆనందంగా ఉంది. ఈ మూవీతో మేం ఇంకో పదేళ్లు సర్వైవ్ అవుతాం. ప్రీమియర్లు వేసిన ప్రతీ చోటా అద్భుతమైన స్పందన వస్తోంది. స్మరణ్ మ్యూజిక్‌తో సినిమా నెక్స్ట్ లెవెల్‌కి వెళ్లింది. తెలంగాణను రిప్రజెంట్ చేసేలా మా చిత్రం ఉంటుంది' అని అన్నారు.

ఎడిటర్ రోహిత్ మాట్లాడుతూ* .. 'రమణ గారితో నాకు ఏడేళ్ల నుంచి అనుబంధం ఉంది. 'అమీర్ లోగ్' సినిమాకి రమణ ఎంతో కష్టపడ్డాడు. ఆ కష్టానికి తగ్గ ప్రతిఫలం ఆగస్ట్ 21న రాబోతోంది. సినిమా అద్భుతంగా వచ్చింది. అందరికీ నచ్చుతుంది' అని అన్నారు. నటుడు యోగి మాట్లాడుతూ.. 'హైదరబాద్ మీద రమణన్న తనకున్న ప్రేమను ఈ 'అమీర్ లోగ్' సినిమాతో చూపించబోతోన్నారు. ఏపీలో వేసిన ప్రీమియర్లకు కూడా మంచి రెస్పాన్స్ వచ్చింది. కరీంనగర్, వరంగల్‌లో వేసిన ప్రీమియర్లకు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది' అని అన్నారు.



# హిందీలో నాయికగా అరంగేట్రం

ఇటీవలే 'లెనిన్' సినిమాతో కెరీర్‌లో భారీ విజయాన్ని దక్కించుకుంది మరాఠీ సుందరి భాగ్యశ్రీ బోర్సే. టాలీవుడ్‌లో సుదీర్ఘ నిరీక్షణ తర్వాత లభించిన ఈ సక్సెస్ పట్ల ఆమె సంతోషంగా ఉంది. ప్రస్తుతం తమిళ, తెలుగు భాషల్లో అగ్ర కథానాయికల్లో ఒకరిగా కొనసాగుతున్న ఈ సొగసరి త్వరలో బాలీవుడ్‌లో నాయికగా ఎంట్రీ ఇవ్వబోతున్నది. ఆదిత్య రాయ్ కపూర్ సరసన భాగ్యశ్రీ బోర్సే ఓ మ్యూజికల్ లవ్‌స్టోరీలో నటించనుంది. మిలాప్ మిలాన్ జవేరి దర్శకత్వం వహించనున్న ఈ చిత్రాన్ని టీ సిరీస్ పతాకంపై భూషణ్ కుమార్ నిర్మించనున్నారు. త్వరలో ఈ సినిమా సెట్స్‌మీదకు వెళ్లనున్నట్లు తెలిసింది. బాలీవుడ్‌లో ఇప్పటికే యారియాన్, చందూ ఛాంపియన్ వంటి చిత్రాల్లో అతిథి పాత్రల్లో మెరిసింది భాగ్యశ్రీ బోర్సే. అయితే కథానాయికగా మాత్రం ఆమెకిది తొలి అవకాశం కావడం విశేషం. ప్రస్తుతం ఈ భామ తమిళంలో 'సేయాన్' చిత్రంలో నటిస్తున్నది. తెలుగులో కొన్ని భారీ సినిమాలు చర్చల దశలో ఉన్నట్లు సమాచారం.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889**. **PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**